



# కులాంగన

## కొవ్వలి నవలల్లో కొన్ని...

'కొవ్వలి' అనే పేరు తెలుగు నవలా ప్రపంచంలో ఒక తరం పాఠకులకు చాలా చిరపరిచితం. ముఖ్యంగా మధ్య తరగతి వారిలో పఠనాభిలాషను పెంచిన రచయిత శ్రీ కొవ్వలి లక్ష్మీనరసింహారావు. అరవైయ్యేళ్ళు నిండేనాటికి వెయ్యి నవలలు రాసిన ప్రతిభ ఆయనది. ఆనాటి పాఠకులనాడి తెలుసుకుని కళాత్మకంగా పాత్రల్ని మలుచుకుంటూ చమత్కారంగా కథని నడిపించేవారు. పెద్దలూ పిల్లలూ, ఆడవాళ్లూ మగవాళ్లూ విరగబడి చదివిన ఈ వెయ్యి నవలల్లో కొన్నింటిని ఆంధ్రభూమి మాస పత్రిక పాఠకులకోసం అందిస్తున్నాం. ఇది నాలుగవది.

"నేను అందంగా ఉండను కదూ?"

"ఎవరన్నారక్కా నువ్వు అందంగా ఉండవనీ?"

"నాకే సందేహం తోచి అడుగుతున్నాను. నీకు తోచింది చెప్పు"

"నువ్వు చాలా అందంగా ఉంటావక్కా. అప్సరసలా వుంటావు. కాశీమజిలీల్లోని దేవకన్యలా ఉంటావు. ఫెయిరీ టెయిల్సులోని ఫెయిరీలా వుంటావు. సినిమాల్లో వేషాలు వేసే ఓ స్టారులా వుంటావు"

"ఛా... నిజం చెప్పరా తమ్ముడూ!"

"నిజమేనక్కా! నా మాట అబద్ధం అయితే ఇంకా ఎవర్నయినా అడుగు. లేకపోతే నిలువుటద్దంలో చూసుకో"

"ఆ సలహాలన్నీ నువ్వు చెప్పేదేమిటిగానీ బాగా తెలిసినవాడవని నిన్నడుగుతున్నాను"

"నాకు తెలుసునని నీకెందుకు తోచిందక్కా?"

"దొంగవు. నీకన్నీ తెలుసు. కథలు రాస్తావు. నాటకాలు రాస్తావు. ప్రతి సినిమాకు వెడుతుంటావు. అందమయినవాళ్లనెంతోమందిని చూసి వుంటావు. అందుకని నిజం చెబుతావనుకున్నాను."

"అయితే నేను చెప్పినదంతా అబద్ధమేనంటావా అక్కా!"

"ఏమో నాకు తెలియదు. ఇలా అడిగినందుకు వేళాకోళం కూడా చేస్తున్నావల్లే వుంది"

"ఛా! లేదక్కా! నీతో వేళాకోళం మాటలాడుతానా? నాయందు గురి ఉండడం వల్లనయితేనేమి, అందం విషయంలో నాకెక్కువ తెలుసునని నీకు తోచడంవల్లనైతేనేమీ నీ మనసులో వున్న సందేహాన్ని గురించి అడిగావు నాకు తోచింది చెప్పాను."

"అయితే నేను నిజంగా అందమయినదానినేనంటావు"

"అందుకు సందేహం లేదక్కా. అసలు నీకిటువంటి సందేహం ఎందుకు కలిగిందో చెప్పు"

"అబ్బే.. ఎందుకూ లేదు. ఊరికేనే అడుగుతున్నానుగానీ నా సౌందర్యంలో ఏ లోటూ లేదంటావా?"

"లేదక్కా. ఇన్నిసార్లు అడుగుతున్నావెందుకు? నీ అందంలో నాకెటువంటి లోటూ అవుపించడంలేదు. నేను చెప్పినదాన్ని దృఢపర్చుకోవడానికింకో పదిమందిని కూడా అడిగి చూడు. తెలుస్తుంది."

"అబ్బే..ఎందుకుగానీ నా జుట్టేమయినా కురచగా ఉంటుందా ఏమిట్రా?"

"లేదక్కా. నీ జుట్టు కురచగా ఉండదే. నుగ్గులుదేరి చాలా అందంగా వుంటుంది."

"కనుముక్కు తీరు"

"అది కూడా చాలా బాగానే వుంటుంది"

"శరీరచ్ఛాయ మంచిది కాదా?"

"ఛీ... ఎవరన్నారూ? పచ్చని బంగారపు ఛాయగాదూ నీది"

"అయితే?"

"ఊ... అయితే ఏమిటక్కా చెప్పు"

"అబ్బే ఏమీ లేదురా"

"నీ అందాన్ని గురించి నీకింత జిజ్ఞాస కలగడానికేదో పెద్ద కారణముండి తీరుతుంది. నువ్వు నాతో చెప్పకుండా ఉన్నావు"

"పెద్ద కారణమేమీలేదుగానీ తమ్ముడూ? మీ బావగారు నా కంటే ఎక్కువ అందంగా ఉంటారుకదూ"

"ఏడిశాడు. బావ అందాన్ని నువ్వే మెచ్చుకోవాలి. ఆ సొట్టముక్కు, ఆ గీరజుట్టు, ఆ పంచకట్టు...పరమ అసహ్యంగా ఉంటాడు"

"అదేమిట్రా గాడిదీ.. అలా అంటావు"

"నీకు కోపమొచ్చినా సరేనక్కా. బావ, నీలో లక్షోవంతయినా అందంగా లేడని, నేను పదిమందిలోనూ ఘంటాపదంగా చెబుతాను" అని తమ్ముడు మధు అన్నదానికి మంజరి దేనిని గురించో దీర్ఘంగా ఆలోచించడం మొదలుపెట్టింది.

"బావనలా అన్నానని నీకు కోపమొచ్చిందా అక్కా?"

"అబ్బే... లేదు తమ్ముడూ. నాకేమీ కోపంలేదుగానీ..."

"ఊ...చెప్పు"

"నేను నిజంగా నువ్వు చెప్పినంత అందంగా ఉన్నట్లయితే..."

"అదిగో మళ్లీ సందేహం"

"ఎందుకులే తరువాత చెబుతా"

"నాకంటే నీకాప్తులెవరున్నారక్కా. అమ్మగన్న ఆరుగురు సంతానంలోనూ మిగిలినవాళ్లం మనమిద్దరమేనా? నీకు నేను, నాకు నువ్వు, చెప్పకోలేకపోతే ఇంకెవరితో చెప్పుకుంటాము?"

"అంతేగాని... తరువాత చెబుతానన్నాగా. నువ్వన్నట్లు నాకు నీకంటే ఆప్తులెవరూ లేరు"

"అటువంటప్పుడు నీ మనసులో వున్నదానిని నాతో చెప్పడానికి సందేహిస్తావెందుకక్కా!"

"సందేహమేమీలేదు తమ్ముడూ. తరువాత చెబుతానన్నాగా"

"సరే నీ ఇష్టం" అని మధు అలమారులో వున్న తన ఫయిలు పట్టుకుని వీధి గదిలోకి వెళ్లిపోయినాడు కథలు రాసుకోవడానికి.

అనంతరం మంజరికేమీ తోచిందికాదు. తిన్నగా నిలువుటద్దం దగ్గరకు వెళ్లి నిలుచుంది.

'నిజంగా నేనందంగా ఉన్నానా? లేక అప్పగారియందుండే అనురాగం కొద్దీ తమ్ముడిలా అంటున్నాడా?'

జుట్టు నుగ్గులుదేరి వున్న మాట నిజమే. అయితే వాడు చెప్పినంత అందంగా ఉందో లేదో!

నుదురు, కనుముక్కుతీరు అద్దంలో నాకూ అందంగానే కనిపిస్తున్నాయి. అయితే ఏం లాభం?

నాకంటే అందమైన వాళ్లు ప్రపంచంలో ఇంకెక్కడా ఉండరా యేమిటి? నేనే అప్సరసనీ, రంభననీ తమ్ముడు చెప్పినదాంట్లో అతిశయోక్తి ఉండక పోలేదు. నిజంగా నేనే అంతటిదానినయితే నా బ్రతుకింత అధ్వాన్నంగా ఎందుకుంటుంది?

కేవలం నన్ను సంతోషపెట్టడంకోసమే తమ్ముడు నాతో ఇలా చెప్పి వుంటాడు. వాడు చెప్పినదాంట్లో కొంచెమైనా సత్యం ఉండకపోతుందా? ఏమో!' అని ఆమె ఎదురుగావున్న నిలువుటద్దంలో తన అందాన్ని ఏ వంద సార్లో, వెయ్యిసార్లో చూసుకుని వుంటుంది. కానీ ఆమె తన సౌందర్యాన్ని గురించి తృప్తి పడలేకపోయింది.

తాను అందగత్తె అవునా? కాదా? ఆమె ఎటూ నిర్ధారణ చేసుకోలేకపోయింది. తన సౌందర్యంలో ఎటువంటి కొరతా లేకపోయినట్లయితే నా బ్రతుకెంత దుఃఖభాజనమెందుకవుతుంది?

భర్త ఓ పిల్ల జమిందారయి ఉండి కూడా తిండికీ బట్టకూ ఎందుకు ముఖం వాచవలసి వస్తుంది?

చెవులకూ, ముక్కుకూ ఎక్కడా చిన్నమెత్తు బంగారంలేదు...అన్నీ బోసి.

ఈ ఆలోచనలతో ఆమె బుర్ర తిరిగిపోయింది. ఆ రాత్రి పది పన్నెండు, ఒంటిగంట కూడా అయింది.

ఆమెకు గుడ్లు పొడారిపోయి నిద్దర తేలిపోయింది. భర్త అంతవరకూ ఇల్లు చేరుకోలేదు.

అతనే రాత్రయినా వస్తే నిద్దరలో వున్న తన్ను పిలువలేక అలసిపోతాడని, వీధి తలుపులను దగ్గరగా నొక్కి అక్కడ సావిట్లోనే ఒక మంచంమీద పడుకుంది.

వీధిగదిలో ఏమో రాసుకుంటున్న ఆమె తమ్ముడు మధు తలుపులు వేసి పడుకోవలసిందని ఆమెను రెండుమూడుసార్లు హెచ్చరించాడు.కానీ ఆమె వినకపోవడంవల్ల అతడు తిరిగి తన రాతలో నిమగ్నమయినాడు.

వారు కోరుకున్న సౌందర్యం నా దగ్గర లేకపోవచ్చు. వారిని సంతోషపెట్టగల చాకచక్యం నాకు లేదు.

కనుకనే నా జీవితం ఈ విధంగా దుఃఖభాజనమైంది. అందుకు నేనిప్పుడెంతగా విచారిస్తే ఏం లాభం?

భగవంతుడా! ఇంత చేసావా అని ఏడుస్తూ అనుభవించడంకంటే వేరు కర్తవ్యమేదీలేదు.

ఈ విషయమంతా తమ్ముడికి తెలిస్తే వాడి మనస్సు కూడా ఖేదపడుతుంది. బావగారితో పేచీ పెట్టుకుంటాడు.

కనుక నా కోరికలను నాలోనే అణచుకుని నా దుఃఖాన్ని నాలోనే దిగమింగడం కర్తవ్యం అని ఆమె తనలో వెయ్యి విధాల ఆలోచిస్తూనే వుంది గానీ ఆమె దృష్టంతా వీధి గుమ్మంవైపే వుంది.

భర్త వస్తాడేమోనని, చీమ చిటుక్కుమంటే ఆవయిపు ఉత్సాహంగా చూసి వెంటనే తిరిగి నిరుత్సాహపడుతుంది. కళ్లు మూస్తూ తెరుస్తూ ఆమె అదే విధంగా పడుకుని వుంది.


ఒంటిగంటకు రాత్రివేళ తలుపులనెవరో మెల్లగా నెట్టిన చప్పుడయింది. ఆమె ఆదుర్దాగా ఆ వయిపు చూసింది.

అతడు భాస్కరం. ఆమె భర్త. సెంటువాసనల గుబాళింపు గది అంతటా విరజిమ్ముతున్నాడు.

భార్య మంజరి నిద్దరలో ఉందనే అతని అభిప్రాయం.

అడుగుల చప్పుడు తెలియనీయకుండా అతడు మెల్లగా వెళ్లి తన గదిలో పడుకున్నాడు.

తన్ను పలకరిస్తాడేమోనని మంజరి ఆశపడింది. కానీ అతడలా చేయలేదు.



GOLLAPUDI VEERASWAMY SON
PUBLISHERS & BOOK SELLERS
Fort Gate, RAJAHMUNDRY-533 101.

Date : 12-10-2010

ఆర్యా,

ఆంధ్రభూమి మాసపత్రికలో వస్తూన్న కొవ్వలి లక్ష్మీనరసింహారావుగారి "అలివేణి", "అబద్ధం పెళ్ళి" నవలలు చదువుతూంటే, గుర్తుకొచ్చిన నా బాల్యస్మృతులను ఒక పబ్లిషర్‌గా పాఠకులతో పంచుకోవడానికే ఈ లేఖ.

రాజమండ్రి వేదికగా గత 90 సం॥లుగా నేటికీ అన్ని రకముల గ్రంథములు ముద్రిస్తూన్న ప్రముఖ ప్రచురణసంస్థ మాది. "గొల్లపూడి వీరాస్వామిసన్" అని అందరికీ తెలిసినదే. 1930-40 ప్రాంతాలలో దాదాపు పాతిక నవలల వరకూ కొవ్వలివారివి మేము ప్రచురించినట్లుగా తెలుసు. మా తాతగారు, తండ్రిగారు అప్పట్లో ప్రముఖ ముద్రాపకులు. 1975 ప్రాంతాల్లో నేను ఫోర్త్‌ఫారం చదివే రోజులలో మా సంస్థ లైబ్రరీలో కొవ్వలి వారి నవలలు పీడా హంతకుడు, బీచ్‌లో హత్య, తప్పేముంది?, బ్రతకడమెందుకు? నువ్వా-నేనా? మొ॥ నవలలు చదివినాను. ఈ పుస్తకాలు ఈరోజున వచ్చే నవలలు 1/8 క్రౌన్‌సైజులో కాకుండా 1/8 డెమ్మీసైజులో 32 పేజీలు (4ఫారాలుగా) వచ్చేవి. అవి చదివేటప్పుడు ఎంతో ఉద్వేగంగాను, ఆసక్తికరంగాను ఉండేవి. నవల చదవడం మొదలుపెడితే పూర్తి అయ్యేవరకు క్రింద పెట్టేవాణ్ణికాను. ఆ తరువాత ఆ నవలా పఠనం వలన పుస్తకపఠనం నాకు ఒక వ్యసనంగా మారింది. అదే ఈరోజున ప్రచురణరంగంలో మా వ్యాపారాభివృద్ధికి దోహదం చేసింది. అయితే - వాటిలో మేము ప్రచురించినవేవో నాకు గుర్తులేదు. అప్పటి కేటలాగ్స్ భద్రపరిచే అవకాశం లేకపోయినందున - కొవ్వలి వారి నవలల్లో ఏవేవి ఎవరెవరు ప్రచురించారో చెప్పడం కష్టమే! పైగా అప్పటి ప్రచురణసంస్థలు కొన్ని నేడు కనుమరుగైపోయాయి. 'వెయ్యి నవలల కొవ్వలి' వారి కొన్ని నవలనైనా మా ప్రచురణ సంస్థ ముద్రించడం మాకు గర్వకారణమే! వారి అత్యధిక ప్రజాదరణ పొందిన నవల "సహస్ర శిరచ్ఛేద అపూర్వచింతామణి" అప్పట్లో గొప్ప సంచలనం. అంతేకాదు! ఆనాడే అత్యధిక కాపీలు అమ్మిన పుస్తకమూ అదే! ఆయన నవలలకు 1970 వరకూ అత్యధిక సంఖ్యలో పాఠకులుండేవారన్నది నిజం. కొత్త తరాలవారికి యండమూరి- మల్లాదీ తెలిసినంత బాగా, మా తరాలవారికి ఆయనో గొప్ప పాపులర్ రైటర్ అన్నది అతిశయోక్తి కాదు. ఆయన వెయ్యి నవలల్లో-కనీసం కొన్ని వందల సంఖ్య నవలలైనా నేడు లభ్యంకాకపోవడం ఒక చారిత్రక దురదృష్టం. ఈరోజున ఆంధ్రభూమిలో "అలివేణి" నవల చదువుతూంటే చిన్నప్పటి రోజులు గుర్తుకువస్తున్నాయి. ఏదేమయినా వారి సాహిత్యంతో మాకూ, చిరకాలంగా సాన్నిహిత్యం మాప్రచురణ సంస్థకూ ఉందని చెప్పడానికే ఈ నాలుగు మాటలూ.

గొల్లపూడి వీర వెంకట రమణమూర్తి
గొల్లపూడి వీరాస్వామి సన్
10-4-15, కోటగుమ్మం, రాజమండ్రి

ఆమె తనంతటతాను అతనిని పలకరించడానికి సాహసించలేకపోయింది. తన మంచంమీద అదే విధంగా మరికొంతసేపు నిరుత్సాహంగా గడిపింది.

కానీ ఆమె ఎక్కువసేపు ఆ విధంగా గడపలేకపోయింది.

'వారు నన్ను పలకరించలేదుకదా అని నేను కూడా పట్టుదల వహించడం తప్పు' అని తనలో అనుకున్న మంజరి మంచంమీద నుండి లేచింది.

ఒకసారి వీధి దగ్గరకు వెళ్లి తమ్ముడేం చేస్తున్నాడో అని చూసింది. అతడంతవరకూ రాసుకుని వున్నాడేమో అలసి ఆ వాలుకుర్చీలోనే పడుకుని నిద్దరపోతున్నాడు.

దీపం చిన్నది చేయబడి ఉంది. మంజరి ఆ తలుపు దగ్గరగా వేసి అనంతరం వీధి తలుపులను గడియవేసి మెల్లగా భర్త పడుకున్న గదిలోకి వెళ్లింది.

అతడు పందిరిమంచం మీద పడుకుని ఒళ్లు తెలియని నిద్దరలో ఉన్నాడు. అతని పక్కగా పడుకోవడానికి ఇంతకంటే మంచి అవకాశం లభించదని మంజరి మెల్లగా అతని పక్కగా పడుకుంది.

మరియొక అరగంటకు భాస్కరం తన ప్రక్కలో పడుకున్న వారిని గుర్తించాడు.

తక్షణం మోచేతితో నెట్టి కిందకు తోసేసాడు. మంజరి అధోలోకంలోకి కృంగిపోయింది. ఎత్తునుంచి పడిపోవడంవల్ల తలకొక పెద్ద గాయం అయింది.

★★★

"ఊళ్లోకి కొత్త పిట్టొచ్చి వాలిందోయ్ బ్రదర్! చూసావా?"

"కొత్త పిట్టా?"

"ఊ...ఊ"

"ఎవరు ఎక్కడ?"

"చూళ్లేదూ?"

"లేదోయ్. ఏదీ నువ్వు చూపించందే ఎలా చూస్తానూ?"

"ఓయ్ నీ అసాధ్యంగూలా! చూడనేలేదన్నమాట"

"లేదు, మంచిపిట్టేనా ఏమిటి?"

"ఇంకా అడిగావా? రంభల్లో రంభ. అప్సరసల్లో అప్సరస. విన్నావూ? భలే సొగసైన పిల్లలే!"

"అలాగా!"

"అటువంటి అందగత్తెను నువ్వింకా చూడకుండా వుంటావా అనుకున్నాను"

"ఎక్కడుందేమిటి?"

"సారా దుకాణం ఎరుగుదువా?"

"సారా దుకాణం! అవును. సంత బజారుకు ఇవతల... నాలుగు రోడ్లూ కలసిన జంక్షను."

"ఆ.. అక్కడ సారా దుకాణానికి కుడి చేతివయిపున ఓ ఇనుప స్తంభాల ఇల్లుంది. ఎప్పుడయినా చూసావా?"

"వీధిలోకి ఓ పెద్ద కిటికీ-ఇల్లు"

"సరి సరి నువ్వూ వసిగట్టావు"

"ఈమధ్య ఆ కిటికీలోంచి ఒక తెల్లచీర అవుపిస్తూ వుంటుంది. రెండు మూడుసార్లు తలలో మల్లెపూలు కూడా కనిపించాయి కిటికీలోంచి."

"భేష్..నువ్వు నాకంటే దేవాంతకుడివోయ్"

"ఏం?"

"నీకింకా ఆ మల్లెపువ్వులు, ఆ తెల్లచీర అయినా కనిపించాయి. నాకా అదృష్టం కూడా కలగలేదు. అందువల్ల నాకంటే నువ్వే లక్కీ ఫెలోవి"

"ఏమీ కనిపించకపోతే ఆమె రంభ, అప్సరస అని ఎలా చెబుతున్నావోయ్ డేమిట్"

"ఊళ్లోకి ఎవరు వచ్చినా మనకు వాకబేగా? అందువల్ల తెలిసిందంతే గానీ ఇంకా మనక్కూడా ఇంటర్వ్యూ కాలేదు."

"ఆమె గొప్ప అందగత్తె అని విన్నావన్నమాట?"

"అవును."

"ఎవరో ఏమిటో తెలుసుకున్నావా?"

"మిగతా ఎంక్వయిరీ అంతా అయిపోయిందిలే"

"అసలు కథ ఏమిటి?"

"యుద్ధ భయంవల్ల కాకినాడ నుంచి వచ్చి ఇక్కడ ఉన్నారు. మొగవాళ్లెవరూ లేరట. తల్లీ, ఆ అమ్మాయినీ"

"తరువాత"

"మామూలే. బిజినెస్ అని విన్నానుగానీ ఓ పట్టాన కుదరదని చెప్పుకుంటున్నారు."

"ఎందుచేత? డబ్బు ఎక్కువ అడుగుతుందా? వెధవ డబ్బు మనకు లెక్కేమిటి? మనిషి నచ్చిందంటే అడిగినంత విసిరికొడతాం. నా సంగతి నీకు కొత్తగాదుగా?"

"నిజమేగానీ ఆ పిల్ల ఎంత డబ్బిచ్చినప్పటికీ అందరికీ ఒప్పుకోదట. ఆమె టేస్టుకు కూడా నచ్చాలిట. అతి రహస్యంగా జరగాలిట"

"ఆమె టేస్టుకు మనం తప్పకుండా నచ్చుతాం"

"అందుకేమీ సందేహం లేదులే?"

"సరే ప్రయత్నం చేసి చూద్దాముండు"

"కిటికీలోంచి కనిపించిన ఆ మల్లెపువ్వులు, వాటము, అంతా చూసాను. ఆమె ఎవరో గొప్ప అందగత్తె అయి వుంటుందని, నేనింతకు ముందే అనుకున్నాను. కానీ ఎవరో ఏమిటో మొదలైన వివరాలు మాత్రం తెలియలేదు. నువ్వు చెప్పేవరకూను. అయినప్పటికీ అయిదారుసార్లు ఆ వీధంట వెళ్లి చూసాను. కానీ ముఖం మాత్రం కనిపించలేదు. ఎవరో ఘోషా స్త్రీ అనుకున్నాను."

"ఘోషా స్త్రీ కంటే ఎక్కువదే. అందుకేమీ సందేహంలేదు"

"అయితే ఇక ఆలస్యం చేయకు. ఈ వేళా రేపట్లో వ్యవహారం తేల్చేయ్"

"తప్పకుండా. అలాగేగానీ సరసీరుహాంతో పేచీ వద్దావుట ఎందుకు?"

"ఎవరు చెప్పారు?"

"అదే చెప్పింది"

"ఏమని చెప్పిందేమిటి?"

"ఎన్ని విధాల అడిగినా తబిసీళ్లు మాత్రం చెప్పింది కాదు. భాస్కరంగారికి నామీద కోపమొచ్చిందండీ. వారంరోజులనుంచీ నా గుమ్మం తొక్కడం లేదు అని మాత్రం అంది."

"అవునా. అసలు విషయం నేచెబుతా విను"

"ఏది ఏమైనా ఈ చుట్టుప్రక్కల సరసీరుహం వంటి సాని లేదని ఒప్పుకుంటావా?"

"ఆ... ఒప్పుకుంటాను.కానీ ఎంత ఘనురాలయిన సాని అయినా అంత నీతి లేకుండా ప్రవర్తిస్తే ఎలాగోయ్ గోరా!"

"ఊ...అసలేం జరిగిందో చెప్పు"

"నావల్ల దానికెంత డబ్బు ముట్టిందంటావు?"

"లెక్కలేనంత ముట్టింది. దానినెవరూ కాదనరు. పేరుకి మాత్రం నెలకు వంద రూపాయలు. అవిగాక ఎన్ని ఆభరణాలు చేయించావు, ఎన్ని బట్టలు కొన్నావు? అది పట్టు పట్టిందని ఇనప్పెట్టెలాంటి మేడ కూడా కట్టించి ఇచ్చావు. ఇదంతా అందరకూ తెలిసిన విషయమే. ఎవరూ కాదనరు."

"అవునా. అటువంటప్పుడు నా విషయంలో ఎంత నీతిగా ఉండాలి. మా ఇద్దరకూ మొదట జరిగిన ఖరారు నీకు తెలిసిందే కదా!"

"అవును."

"ఏమిటి?"

"నిన్ను తప్ప లక్ష రూపాయలిచ్చినా అన్య పురుషుణ్ణి కన్నెత్తి చూడనని ప్రమాణం చేసింది. కాగితం కూడా రాసి ఇస్తానంది"

"అటువంటి సందర్భంలో ఏం పని చేసిందో చూడు"

"ఏం చేసింది?"

"ఈ చుట్టుప్రక్కల ఎంతమంది వేశ్యలున్నారో అందరి చేతులూ చూసినవాణ్ణి నేను. అయినప్పటికీ ఇది అందరికంటే అందంగా వుంటుందన్న కారణంవల్లనయితేనేమీ, అది కోరినంత డబ్బూ ఇస్తూ ఎవ్విధమయిన లోటూ లేకుండా కథ నడుపుతూ వుంటే చివరకు తుంటరిపని చేసింది. అసలు ఆ జాతిని నమ్మకూడదు."

"ఇంతకూ అది చేసిన పనేమిటో చెప్పావుకావు"

"ఇంకే చేస్తుంది. ఆ బట్టల కొట్టువాడితో రహస్యంగా వాడికంటుపడి కథ నడిపిస్తూంది."

"సరి..ఎంత పని చేసింది?"

"ఇలా ఎంతకాలం నుంచి నడుస్తోందో నాకు తెలీదు. ఒకనాడు నాటకానికెళ్లడంవల్ల దాని ఇంటికి చాలా ఆలస్యంగా వెళ్లాను. అప్పుడతడు దాని ఇంట్లో పందిరిమంచం మీద ఠీవిగా పడుకున్నాడు."

"నువ్వొస్తున్నావని తెలిసి ఉండి కూడా వాడలాగే పడుకుని ఉన్నాడన్న

మాట. ఎంత ధైర్యం?"

"అంతకుముందు నాటకానికి దాన్ని కూడా రమ్మని అడిగాను సరదాగా ఇద్దరమూ వెళ్లి రావచ్చుకదా అని. అంటే తనకు ఒంట్లో బాగుండలేదనీ, నిద్దర లేకపోతే సుస్తీ ఎక్కువవుతుందనీ నా దగ్గర నాటకమాడి నాతో నాటకానికి రావడం మానేసింది. నేనూ గుమ్మం దిగగానే అతగాడికి కబురంపింది. చూసావా... పరాకున తలుపు గడియ వేసుకోవడం మరచిపోయారు కాబట్టి పాపం బద్దలయింది."

"బాగానే వుంది. తరువాత ఏమయిందీ?"

"నేను దానివైపు కళ్లెరజేసి చూస్తూ వుంటే అతడు నామీదకు ఎదురు తిరగబడ్డారు. అతడు పందిరిమంచమయినా దిగకుండా తన మొలలోంచి కత్తిని లాగి మెరిపిస్తూ-

'నోరెత్తావంటే ఖైమా అయిపోతావు. తక్షణం అవతలకు దయచెయ్యి. ఈ సాని నా స్వంతం. నువ్వు తిరిగి ఎప్పుడయినా ఈ గుమ్మం తొక్కావంటే జాగ్రత్త' అని వాడు రాక్షసుడిలా మీద పడబోతూ వుంటే ఇహ నేనేం చేయను?"

"సరసీరుహం ఊరుకుందన్నమాట"

"ఊరుకున్నా సరసంగానే వుండేది. పకపక నవ్వుతూ వెళ్లిపోవలసిందని చేతులతో దారి చూపించింది. విన్నావా?"

"ఆసి భడవా! ఎంత పని చేసింది. నేను నిన్న తనకు అప్పగించానని అయినా ఆలోచించింది కాదే"

"అటువంటి సమయంలో నేను ఏం చేయను. చూస్తూ చూస్తూ అక్కడ నిండు ప్రాణాన్ని ఎలా పోగొట్టుకుంటాను? బ్రతికి వుంటే అటువంటి సానులు వందమంది దొరుకుతారు"

"ఆహా... వెయ్యిమంది కూడా దొరుకుతారు"

"అప్పుడిక పేచీ పడి లాభం లేదనుకుని ఇద్దరికీ సలాము చేసి బుద్ధి వచ్చిందని రెండు లెంపలూ వాయించుకుని వెనుదిరిగి చూడకుండా పరుగెత్తి ప్రాణాలతో బయటపడ్డాను. విన్నావా?"

"అవునులే. మంచి పని చేసావు. అప్పుడంతే చేయాలి. తిరిగి దాని గుమ్మం తొక్కనేవద్దు"

"సరి... ఇంకానా? జన్మలో సాని అన్నదాన్ని నమ్మకూడదనీ, దాని గుమ్మం తొక్కకూడదని ప్రతిజ్ఞ చేసుకున్నాను. విన్నావా?"

"మంచి పని చేసావు. ప్రపంచంలో సాన్లను మించిన సరసురాండ్రున్నారు"

"అందుకనే ఇటువంటి ప్రతిజ్ఞ చేసాను."

"ఇప్పుడు నేను చెప్పిన పిల్ల వుంది చూసావూ... ఆమె ఆ సరసీరుహాన్ని మింగి పుట్టిందంటే నమ్ము"

"ఆమె వేశ్య జాతికి చెందినదిగాక పోయినట్లయితే మాత్రం తప్పకుండా రైటు చెయ్యి. శాశ్వతంగా ఉండిపోతుంది."

"అలాగే వుంది. నా అభిప్రాయం కూడా. తప్పక చేస్తా" అని గోరా, భాస్కర్రావుకు అభయహస్తమిచ్చాడు.

★★★

మంజరి సుమారు ఇరవై సంవత్సరాల ముగ్ధ సుందరి. ఆమె సౌందర్యాన్ని గురించి లోకులందరూ చెప్పుకునే మాట సత్యదూరం కాదు. ఆమె లావణ్యంలో రంభకే తగును. అప్సరకే సాటి!

అయితే కొంచెం అమాయకురాలు. మాయమర్మము తెలియని పవిత్ర హృదయ. భర్తను భగవంతుడని నమ్మిన ఉత్తమ ఇల్లాలు. వేశ్యలమరిగినవాడికీ, స్త్రీ వ్యసనంలో మునిగినవాడికి కులాంగన రుచించదు కదా!

అతడామెను ఎన్నివిధాల హింసలు పెట్టినా, కొట్టినా, తిట్టినా ఆ గుట్టును బయటకు రానీయకుండా నిండు చేసుకుంటూంది మంజరి. అతని సేవలలో అణుమాత్రమయినా లోటు చేయడంలేదు. అయినప్పటికీ అతని కళ్లకామె ఒక చీడపురుగు. వారకాంతవలె ఆమె భర్తను చెమక్కులతోను, కృత్రిమ ప్రేమతోనూ ఆనందింపజేయలేక పోయిన కారణంవల్ల అతడామెనెంతగానయినా అసహ్యించుకుని ఆమె ఉనికినే కంటకప్రాయంగా యెంచుతున్నాడు. భర్త తన్నావిధంగా అనాదరణ చేసి హింసలు పెట్టడానికి తన సౌందర్య లోపమని కొంతకాలమనుకుంది. భర్తను రంజింపచేసి అతన్ని వశం చేసుకోగల సామర్థ్యం తనకు లేదని కొన్నాళ్లనుకుంది. చివరికది తన ప్రారుబ్ధకర్మమనీ, అనుభవించడమే కర్తవ్యమనీ నిర్ధారణ చేసుకుంది. తన కోరికలను తనలోనే చంపుకుంది. భర్తతో ఆనందానుభవాన్ని పొందే యోగ్యత తనకా జన్మకు లేదని నిస్పృహ చెందింది.

భర్తను రొష్టు పెట్టడం ఇష్టం లేకపోవడంవల్ల ఈ విషయాలన్నింటినీ ఇంట్లో ఉండే తోడబుట్టిన వాడికయినా తెలియనీయకుండా దిగమింగింది.

మధుకూ, అప్పగారికీ వయస్సులో ఒక సంవత్సరం కంటే ఎక్కువ తేడాలేదు. తండ్రి పోయినప్పటినుంచీ అతడు అప్పగారి దగ్గరనే వుంటున్నాడు. భాస్కరం తనలో ఏమనుకున్నాడోగానీ బావమరిది తమ ఇంట్లో ఉండడమును గురించి ఎన్నడూ అభ్యంతరపెట్టడు. మధు చాలా బుద్ధిమంతుడనీ, యోగ్యుడనీ భాస్కరానికతనియందు ఆదరమూ, భయము కూడా ఉన్నాయి.


బావగారియొక్క దుండగాలన్నీ మధుకు తెలియవు. తెలిస్తే ఆ కాపురమీపాటికి సుఖపడేదేమో! కానీ భర్తయొక్క దుండగాలన్నీ చెప్పి అతన్ని వెలితిపర్చడం మంజరి ఉద్దేశ్యమెంతమాత్రమూకాదు. అందువల్ల మధుకు భార్యాభర్తల నడుమనుండే భేదభావం ఎంతమాత్రం తెలియదు.

మధు సాహిత్య గోష్ఠిలో నిద్రాహారాలు సయితమూ మరచిపోతాడు. అతను రాసే కథలనూ, గీతాలనూ పత్రికలు కళ్లకద్దుకుని ప్రకటనలు చేసి అతన్ని బహూకరిస్తాయి. అతని రచన కోసం పాఠక లోకం ఎదురు చూస్తూ వుంటుంది.

ఆనాడు పౌర్ణమి. భాస్కరం భోజనం చేసి రాత్రి షికారుకు బయలుదేరాడు. దొడ్లోని వెన్నెల మల్లెలారబోసినట్లుండడంచేత మధు అక్కడ ఒక పడక కుర్చీని వాల్చి కూర్చుని గీతాలు రాసుకుంటున్నాడు.

నిస్సారమైవున్న తన జీవితంలో లేని సంతోషాన్నయినా తెచ్చి పెట్టుకుని కొంచెం ఆనందంగా ఉండాలన్న బుద్ధి పుట్టిందానాడు మంజరికి.

బ్రతికేదెంత కాలమో, చచ్చేదెప్పుడో తెలియని సందర్భంలో జీవించిన నాలుగురోజులూ దుఃఖిస్తూ గడపడంకంటే ఏదో విధంగా ఆనందమును



తెచ్చి పెట్టుకుందామని ఆమె ప్రయత్నం.

ఉన్నవాటిలో మంచి చీర కట్టుకుంది. దొడ్లోని మల్లెలు కోసి తల నిండా తురుముకుంది. అంతమాత్రంలోనే ఆమె సహజ సౌందర్యం వెయ్యిరెట్లు అధికమయింది. ఆనాడింటిదగ్గర పడుకోవలసిందని భర్తను అనేక విధాలుగా బ్రతిమాలింది. వినకపోగా అతడామెను కాలితో తన్ని చక్కాపోయినాడు. అతను వెళ్లిపోయిన అనంతరం తన అందాన్ని తానే నిలువుటద్దంలో చూసుకుని మురిసిపోవడం మొదలుపెట్టింది.

ఆ రాత్రి పదిగంటలవరకూ ఆమె ఆ నిలువుటద్దం దగ్గరే గడిపింది. అనంతరం ఆమెకెందుకో మతి పోయినట్లయింది. గోడనున్న భర్త ఫోటోను తీసి తనివితీరా ముద్దు పెట్టుకుంది. దానిని హృదయానికి హత్తుకుని మురిసిపోయింది. అది నిర్జీవ ప్రతిమ అన్న విషయమును కూడా మరచిపోయి దానిని పలకరించడమూ, నవ్వడమూ, తుళ్ళడము మొదలైన చేష్టలతో కొంతసేపు తృప్తిపడింది.

కానీ ఆమెలో రేకెత్తిన కోరికను ప్రాణంలేని బొమ్మ తీర్చలేకపోయింది. ఆ ఆనందంలోనే ఆమెకు పట్టలేని ఆగ్రహం కలిగింది. 'నా కోరిక తీర్చలేని ఈ బొమ్మను పట్టుకుని ఏడుస్తానెందుకు?' అని ఆమె ఆ పటాన్ని బలంకొద్దీ నేలకేసి కొట్టింది. దాని అద్దం ముక్కముక్కలై చెదిరిపోయింది. అప్పుడామె చేసే పనులామెకే తెలియడంలేదు.

'నేనెంత అందంగా ఉన్నాను? అయితే ఏం లాభం? ఈ నా సౌందర్యం ఎవరికీ అవసరం లేకపోయింది' అని తనలో అనుకొన్నప్పుడామెపై ఆమెకే అపరిమితమైన ఆగ్రహం కలిగింది. మొగలిపొట్టలవంటి ఆ సుకుమారమైన చేతులు నోటిలో పెట్టుకుని బలంగా కరుచుకుంది. నెత్తురు చిమ్మడంతోనే బాధ కలిగింది.

లోపలికొచ్చిన మధు ఏమీ అర్థం చేసుకోలేకుండా ఉన్నాడు.

"అక్కా! ఇలా చూడు. ఏమిటిదంతా?" అంటూ అతడామె ముఖము నెత్తి అడుగుతుంటే ఆమె మరింత కుమిలి కుమిలి ఏడవడం కంటే వేరు జవాబేమీ చెప్పలేకుండా ఉంది.

"ఎందుకలా ఏడుస్తావు? బావయేమయినా అన్నాడా ఏమిటి?" అని తిరిగి అడిగాడు మధు.

"ఏమీ అనలేదు తమ్ముడూ... నన్నెవరూ ఏమీ అనలేదు" అని ఆమె తిరిగి చేతులతో ముఖమును కప్పేసుకుని సంతత ధారాపాతంగా ఏడుస్తూ తన గదిలోకి వెళ్లిపోయింది.

అప్పుడు జరిగిన ఆ ఘట్టంతో మధుకు మనస్సంతా వికలమైపోయింది. ఏదో పెద్ద కారణముందేగానీ మంజరి అంత విలపించదనుకున్నాడు. ఆ కారణమును తనతో ఎందుకు చెప్పలేదా అని ఆశ్చర్యపోయాడు. ఆమె దుఃఖమును చూసేటప్పటికి అతనికీ దుఃఖమొచ్చింది.

చెదిరిపోయిన హృదయంతో తను కూడా ఆమె వెనుకాలనే గదిలోకి వెళ్లాడు. మంజరి అక్కడ మంచంమీద పడుకుని ఇంకా అలాగే వెక్కివెక్కి ఏడుస్తోంది. గది నిండా గాజుపెంకులు, వాటి మధ్యన బావగారి ఫోటో.

ఆ అల్లరి పనంతా ఎవరిదై వుంటుంది అని క్షణకాలం ఆలోచించాడు.

భాస్కరమే అప్పగారిపై ఎందుకో ఆగ్రహించి ఫోటోను బద్దలు కొట్టి గదినంతటినీ ఆ విధంగా చిందరవందర చేసి ఉంటాడని నిశ్చయం చేసుకున్నాడు. ఆ ఆలోచన తట్టినప్పుడతనికి బావగారిమీద అమితమైన ఆగ్రహం కలిగింది. అతను కనుక అప్పుడెదురుగా ఉన్నట్లయితే మధు ఎటువంటి సాహసమైనా చేసేవాడు. 'అతను అదృష్టవంతుడు కాబట్టి సమయానికింట్లో లేకుండా పోయాడు' అని తనలో అనుకుని అప్పగారు పడుకుని ఏడుస్తున్న మంచం దగ్గరకు వెళ్లి ఆమె చేరువలో కూర్చున్నాడు.

"అక్కా! నాతో చెప్పవా? ఎందుకిలా ఏడుస్తున్నావు? చెప్పకపోతే నామీద ఒట్టు" అంటూ అతడామెను బుజ్జగిస్తూ అడిగాడు. అతడు పలకరించినకొద్దీ ఆమెకు దుఃఖం మరింత ఎక్కువవుతోంది.

"నువ్విటువంటి ఒట్టు పెట్టకపోయినట్లయితే ఈ నా దుఃఖ కారణాన్ని ఎవ్వరితోనూ చెప్పదలచుకోలేదు తమ్ముడూ. కానీ ఇప్పుడిక తప్పదు" అని ఆమె ఒక్కసారిగా తన మనసులోని గుబులునంతటినీ వెడలగ్రక్కేసేటట్లు తమ్ముడిదగ్గర ఒక్కసారిగా ఏడ్చేసింది.

"నీకొచ్చిన భయమేమీ లేదక్కా. నాతో చెప్పు. బావ కొట్టాడా? తిట్టాడా? ఈ అద్దమంతా ఇలా ముక్కలు ముక్కలుగా బద్దలైపోయిందెందుకూ?" అని అతడు ఆమె కళ్లనీళ్లు తుడుస్తూ అడగ్గా ఆమె కొంత దుఃఖమును దిగమింగి తమ్ముడితో ఇలా చెప్పింది.

"మధూ! నన్నెవరూ కొట్టలేదు, తిట్టనూలేదు. కానీ ఈ ఇంటికి కాపురానికి వచ్చినది మొదలు ఈ క్షణం వరకూ మీ బావగారి వల్ల ఒకే విధమైన హింసను అనుభవిస్తున్నాను. నాన్నగారు చనిపోయిన ఈ నాలుగైదు మాసాలనుంచీ నువ్విక్కడనే వుంటున్నప్పటికీ నీ మనస్సును చెడగొట్టినదానినవుతానని, గొడవలకు కారణమవుతుందనీ, కుటుంబంలో జరిగే దారుణాలన్నిటినీ నీకు తెలియకుండానే కమ్ముకుంటూ వచ్చాను.

నేను అందమైనదానిని కాననో, మరెందువల్లనో మీ బావగారికి నేనంటే సుతరామూ ఇష్టంలేదు. వారు నన్నొక చీడపురుగును చూసినట్లుగా చూసి అసహ్యించుకుంటున్నారు. నేను కాపురానికి వచ్చాక వారొక్క రాత్రయినా ఇంట్లో పడుకోలేదు. అంతేకాకుండా, నేను బ్రతకడము, నిత్యము వారి కళ్లకు కనిపిస్తుండడం కూడా ఆయనకిష్టంలేదు. ఈ కారణంవల్ల నేను తింటూ తింటున్న అన్నంలో కిరసనాయిలు గుమ్మరిస్తారు. కట్టుకున్న బట్టలకు నిప్పంటిస్తారు. ఇటువంటివన్నీ నీతో చెప్పడమెందుకుగాని, నా ఉనికి కూడా ఆయనకిష్టం లేకుండాపోయింది.

ఇటువంటి సందర్భంలో నేను బ్రతికి ఏం ప్రయోజనం అని ఏడుస్తున్నాను. ఈవేళ ఒక్కరోజు ఇంట్లో పడుకోవలసిందని ఎన్ని విధాల బ్రతమాలానో నీకు తెలియదు. నా మాట వినకపోవడమే కాకుండా బలంకొద్దీ కాలితో తన్ని చక్కాపోయారు" అని అప్పగారు చెబుతున్నకొద్దీ మధుకు బావగారిమీద ఆగ్రహం ఎక్కువైపోతోంది. అతడు కంటికి కనిపించాడంటే నిలువునా చీరెయ్యాలని అతని సంకల్పం.

ఆ విషయమును మంజరి గమనించకపోలేదు.

"మధూ! నువ్వు దుడుకువాడివని నాకు తెలుసు. అందుచేతనే ఈ విషయాలన్నింటినీ ఇంతవరకూ చెప్పలేదు,. నువ్విటువంటి తొందరపనిని దేనినయినా చేసావంటే నేను ఏ నూతిలోనో, గోతిలోనో పడి ఆత్మహత్య చేసుకుని తీరుతాను. నీకు చేతనైతే నీ తెలివితేటలవల్ల బావగారికైనా ఉపాయంవల్ల గుణపాఠం చెప్పు. వారి నా దుర్మార్గతల నుంచి తప్పించి నాకానందనమును కూర్చు" అని అక్కగారు చెప్పినదానినంతటినీ శాంతంగా విన్నాడు మధు. తననో ఏమి నిశ్చయం చేసుకున్నాడో 'సరే'నన్నట్లు ఒకసారి తలను పంకించాడు. అదే అతడామెకిచ్చిన అభయహస్తం.

★★★

"ఆమె కులాంగన. ఆమెనింకా ఇదే విధంగా ఉసురుపెట్టావంటే నువ్వూ నీ వంశమూ కూకటివేళ్లతో కూలిపోతారు. ఒక కులాంగన కంట తడి పెట్టిందంటే త్రిలోకాలూ దహించుకుపోతాయి. అటువంటిది నువ్వనగా ఎంత? మా బావనింతవరకూ తెచ్చింది నువ్వు. నీవల్లనే అతడింతగా చెడిపోయినాడు. గోరా! బాగా ఆలోచించుకో. బావ బుద్ధి మార్చి, మా అక్కయ్య కాపురాన్ని సరిచెయ్యగల శక్తి నీలో వుంది. నాకు సర్వ విషయాలూ తెలి

సాయి. నువ్విప్పుడు నేను చెప్పినట్లు చేయకపోయావంటే సర్వనాశనమైపోతావు. అది కవి కుమారుడి శాపం, తెలిసిందా?'' అని గోరాను రోడ్డుమీద నిలబెట్టి అన్న మాటలు, ఆ దృశ్యము గోరాకు రాత్రస్తమానమూ నిద్దట్లోనే ఉన్నాయి. "ఆమె కులాంగన. ఆ కాపురం పాడవడానికి కారకుణ్ణి నేను. ఆమె కన్నీరు కారిస్తే నాకు జయంకాదు'' అని తెల్లవారుఝామున గోరా నిద్దట్లో కలవరిస్తూ లేచాడు. అతని శరీరమంతా భయంతో నిండిపోయింది, వణకడం మొదలుపెట్టింది.

'అది కవి కుమారుడి శాపం. అడ్డులేదు' అని అతడు తనలో ఏమేమో గొణుక్కుంటూ నిద్దర మంచంమీదనుంచి లేచేటప్పటికి భార్యాబిడ్డలతనికెదురై-

"ఏమిటండీ? రాత్రస్తమానమూ ఏమిటో కలవరిస్తున్నారు?'' అని అడిగారు. అతదండరనూ ఒక్కసారి కళ్లతో చూసుకుని అంతవరకూ అందరూ సురుక్షితులేయి వున్నందుకు సంతోషించాడు.

"అబ్బే... ఏమీ లేదర్రా. మంజరి కులాంగన. సందేహంలేదు. ఆమె ఉసురు తప్పక తగులుతుందని నిన్న వాళ్ల తమ్ముడు మధు నాకు వాళ్ల ఇంటి పరిస్థితులన్నింటినీ చెప్పాడు. ఆ విషయమే రాత్రస్తమానమూ నిద్దట్లో కలగా వచ్చింది'' అని అతడు వారికప్పటికి తృప్తిని కలిగించి కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లాడు.

తిరిగి ఈ వేళ కలుసుకుని ఏ సంగతినీ చెప్పమన్నాడు. మధు అతనికి వ్యతిరేకంగా ప్రవర్తించినట్లయితే నన్ను నిలువునా నిలుచోబెట్టి చీరేసేటట్లున్నాయి అతని కళ్లు.

'బావగారిచేత ఈ నాటకాలన్నీ ఆడించే సూత్రధారుణ్ణి నేనని అతనికెలా తెలిసింది? కొంతకాలం సిఐడి పని చేసి సర్వమూ గ్రహించి ఉంటాడు.

ఏది ఏమైనా అతడు చెప్పినట్లుగా చేయడమే నాకు కర్తవ్యం. నామూలంగా ఆ కులాంగన ఇంతవరకూ ఉసురుపడ్డ మాట వాస్తవం. భాస్కరం నా మూలంగా ఈ స్థితికొచ్చి చెడిపోయినాడుగానీ లేకపోతే పరస్త్రీని కన్నెత్తి చూసినవాడు కాడు. అయిందేదో అయిపోయింది. ఇప్పుడు మధు చెప్పినట్లుగా ప్రవర్తించి మంజరి కాపురమును సరిచేసి ఆమె హృదయానికి శాంతి చేకూర్చడమే నా కర్తవ్యం' అని తనలో తాను నిశ్చయం చేసుకున్న గోరా, కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం దుస్తులు వేసుకుని బయటకు బయలుదేరాడు. మధు అప్పటికే గోరా రాకకోసం కాఫీ హోటల్ దగ్గర కనిపెట్టుక్కూర్చున్నాడు.

"ఏమాలోచించావ్?'' అని మధు అతన్ని చూసీ చూడడంతోనే తీక్షణంగా అడిగాడు.

"నీ మాటకిక తిరుగులేదు మధూ. నువ్వేమి చేయమంటే అలా చేయడానికి నేను సంసిద్ధుడనై ఉన్నాను. ఏమి చేసినా ఒక కులాంగన కాపురాన్ని పునరుద్ధరించడానికేకదా'' అని గోరా చెప్పేటప్పటికి మధుయొక్క తీక్షణ రూపం చల్లారింది. ఇద్దరూ కాఫీ తాగిన అనంతరం తిరిగి బయటకువచ్చి అక్కడ కొంతసేపు గుసగుసలాడుతున్న సమయంలో భాస్కరం కూడా అక్కడికి వచ్చాడు.


బావమరిది గోరాతో మాటలాడుతుండడం చూసి అతడు తెల్లబోయాడు. భాస్కరం కనుచూపుమేరలో కనిపించగానే గోరాకు చెప్పవలసినదంతా అంతకుముందే చెప్పేయడంవల్ల మధు వెంటనే ఆ ప్రక్కసందులోకి తప్పుకున్నాడు. క్రమంగా భాస్కరం గోరా దగ్గరకొచ్చాడు.

"ఏమిటోయ్ గోరా! మా బావమరిదితో గుసగుసలాడుతున్నావేమిటి? మన రహస్యాలుగానీ అతనికి చెప్పలేదుకదా. మధు దేవాంతకుడు సుమా!'' అని భాస్కరం ఆదుర్దాగా అడిగినదానికి-

"ఓయబ్బో... మనం అంతకంటే దేవాంతకులం. మన రహస్యాలు నేనెందుకతనికి చెబుతాను?''


"సరి ఆ మాత్రం జాగ్రత్తలో వున్నావుకదా. మరయితే ఏమిటి మాటలాడుతున్నాడు?''

"ఇద్దరమూ ఒకే చోట కూర్చుని కాఫీ తాగడం తటస్థించడంవల్ల ఆ యుద్ధ వార్తలు, ఈ లోకాభి రామాయణం మాటలాడుకుంటూ ఇవతలకొచ్చాము. ఇంతలో నువ్వూ వచ్చావు. వేరే పని వుందని అతను వెళ్లిపో



## లక్కీ దీపిక!

చాలాకాలంగా హిట్ కోసం ఆశగా ఎదురుచూస్తున్న దీపికా పదుకొనేకు మంచి అవకాశం వెతుక్కుంటూ వచ్చింది. 'రేస్-2' చిత్రంలో దీపిక హీరోయిన్‌గా నటించే అవకాశం ఎక్కువగా వుందని అనుకుంటున్నారు. మొదట ఈ చిత్రంలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా అనుకున్నారుట. కానీ చివరకు ఆ అవకాశం దీపిక సొంతం చేసుకుంటోందని సినీ జనాలు చెప్పుకుంటున్నారు. అనుకోకుండా వచ్చిన ఈ సువర్ణావకాశానికి దీపిక తెగ సంతోషపడిపోతోందిట!



యాడు. అంతకంటే విశేషమేమీలేదు''

"వెరీగుడ్. అయితే కాఫీ తాగుదాంరా''

"అయిందిగా?''

"మళ్లీ రావోయ్'' అంటూ భాస్కరం అతని చేయి పట్టుకుని బలవం తాన లోపలకు తీసుకువెళ్లి తిరిగి తనతోపాటు కాఫీ వగైరాలను సేవింప జేస్తూ మాటలాడుతున్నాడు.

"రానురాను నువ్వు వొట్టి ఉన్నువైపోతున్నావేం గోరా! మొదట్లో ఎంత చురుకుగా వుండేవాడివి?''

"అలా అంటున్నావేం?''

"ఇంకా చెప్పాలన్నమాట. ఊళ్లో ఎవరో కొత్త పిట్ట వాలిందని చెప్పి ఎంతకాలమైంది? తిరిగి ఆ వ్యవహారమేమైనా కూపీ తీసావా లేదా?''

"ఇన్ని రోజులనుంచీ నేనేం చేస్తున్నాననుకున్నావు?''

"ఆ వ్యవహారమే చూస్తున్నావా?''

"అందును గురించి ఎంత కష్టపడుతున్నావో నీకేం తెలుసు? అది అంత సులువుగా లభ్యమయ్యే పిట్టగాదోయ్!''

"అలా అంటే ఎలా ఎలా? సాధించాలిగానీ''

"సాధించక విడిచిపెడతామా ఏమిటిలే?''

"అది కనుక మనకు ఖాయంగా రైటైనట్లయితే చిల్లర కాగితాలన్నీ కట్టిపె ట్టెయ్యొచ్చు''

"నా ఉద్దేశ్యం కూడా అదే. ఎలాగైతేనేం బ్రహ్మప్రయత్నం చేసాక ఆమెను చూడడం తటస్థమైంది''

"ఏమిటీ నువ్వా సుందరాంగిని చూసావా?''

"చూసానోయ్! ఆమె అప్సరస అని ఇదివరకు విన్నానుగానీ ఈమె కాలిగోరుకైనా ఏ అప్సరసా కూడా పనికిరాదని ఆమెను చూసిన మీదట తెలుసుకున్నాను''

"అబ్బా... అంత గొప్ప అందగత్తె అన్నమాట?''

"అందుకు సందేహమా? ఆమె అందాన్ని నేను వర్ణించి చెప్పలేకుండా ఉన్నానుగానీ వెయ్యి నాలుకలు కలిగిన ఏ ఆదిశేషువైనా అయితే ఆ సుంద రాంగిని వర్ణించి చెప్పగలుగును''

"అంతలేసి అందమయినవాళ్లు కూడా ఈ ప్రపంచంలో ఉన్నారన్న మాట. అటువంటి స్త్రీని అనుభవించకపోతే ఈ జన్మ ఎందుకు?''

"సత్యమంతే''

"అయితే మన వ్యవహారమును ఏమైనా కదలేశావా లేదా?''

"ఆమె దర్శనం కోసం కొండ తవ్వి ఎలుకను పట్టవలసివచ్చింది''

"నువ్వు చెప్పింది నేను కాదనను. నేనా వీధంట ఏ పాతిక ముప్పయి సార్లో తిరిగితే ఆమె కట్టుకున్న తెల్లటి మజిలీసీ చీర ఒకసారి, తలలోని మల్లె పువ్వులొకసారి కనిపించడం బ్రహ్మాండమైపోయింది''

"చూసావా మరి! నేను కాబట్టి లోపలకు ప్రవేశము సంపాదించి ఆమెతో మాట్లాడి చక్కా వచ్చాను''

"నీ సామర్థ్యం నాకు తెలీదూ?''

"ఎక్కువకాలం అవసరంలేదు. కొద్దిరోజులు ఓపికపట్టు. ఆ అప్సరసను నీకు శాశ్వతంగా సమకూరుస్తా''

"రైటు... పోదాం పద'' అని స్నేహితులిద్దరూ చెయ్యి, చెయ్యీ కలుపు కుని ఉత్సాహముగా నడిచిపోయారు.

★★★

"నీకెవరో చెప్పి పెడుతున్నారల్లే వుంది. నా ఎదురుగా నిలిచి ఎప్పు డైనా ఇలా అడిగావా?''

"నేనిప్పుడు తప్పుడు మాట ఏమీ అనలేదే? కట్టుకున్న భార్యనీ విధంగా ఉసురుబెట్టి అహర్నిశలు వేశ్యావాడలో గడపడం ధర్మం కాదంటు న్నాను.''

"ఈ ధర్మోపదేశాలు చేయడానికి నీకేం అధికారం ఉంది. మొగవాడు మహారాజు. అతడేమి చేసినా చెల్లుతుంది.''

"అలాగునని లోకంలో వుండే పురుషులందరూ మీలాగునే సంచరిస్తు న్నారా?''

"నువ్వడిగే చవట ప్రశ్నలకన్నింటికీ సమాధానాలు చెప్పడం నాకవస రంలేదు''

"పోనీ నాలో వున్న లోటేమిటో చెప్పండి''

"అంతా లోటే''

"నా సౌందర్యం మీకు నచ్చలేదనుకుంటా''

"నీ దగ్గర అసలు సౌందర్యామనే పదార్థముంటేగా నాకు నచ్చక పోవడా నికి?'' అని భర్త అన్నదానికి మంజరి ఒక వేడి నిట్టూర్పును విడిచింది.

"నువ్వొక జంతువ్వు, ఒక మృగానివి, ఒక చీడపురుగువు.''

"వాస్తవమే. అయితే అటువంటి భార్యను ఎందుకు వివాహం చేసుకు న్నారు?''

"బుద్ధితక్కువ, పొరపాటు. ప్రపంచంలో రకరకాల సౌందర్యాలున్నా యని నాకంతకుముందు తెలీదు.''

"నన్ను వివాహం చేసుకున్నాకే తెలిసిందన్నమాట''

"అవును. సరసీరుహం సౌందర్యంలో నువ్వెన్నో వంతు? బంతి పువ్వు చక్కదనం ముందు నువ్వెందుకు పనికొస్తావు? మీనాక్షి కాలిగోరుకయినా నువ్వు చాలవు. వనమాల మోల నిలవడానికైనా నీకర్హతలేదు. తెలి సిందా?'' అని అతడు తన వుంపుడుగత్తెల లిస్టు నొక్కసారి ఏకరువున పెట్టాడు.

"మీరు చెప్పినవాళ్లందరూ ఎవరూ?''

"నా ప్రియురాండ్రు. నన్నానంద తరంగాల్లో ఊగులాడించగల సరసు రాండ్రు. విన్నావా?''

"ఆ విన్నాను''

"ఇహ ఎప్పుడూ ఇటువంటి చవట ప్రస్తావన తీసుకురాకు తెలిసిందా? మెడలో పుస్తె కట్టినందుకు నిన్నీ ఇంట్లో ఉండనీయడమే గొప్ప ఉపకారమ నుకో'' అని భర్త చెప్పిన సమాధానమును మంజరి తిరుగు జవాబు చెప్ప లేదు. ఆమె అక్కడినుంచి వెళ్లిపోతూ ఉండగా-

"ఏయ్ ఇలారా?'' అని అతడు తిరిగి పిలిచి "ఈమధ్య రోజూ నువ్వూ మీ తమ్ముడు ఎక్కడికి సాయంకాలం షికారుకు బయలుదేరుతున్నారు?'' అని తీక్షణంగా అడిగాడు.

"అబ్బే... ఎక్కడికీలేదు. పొద్దస్తమానమూ ఇంట్లో కూరుకుపోతే కాల క్షేపం అవడంలేదని మధు నన్ను కాలువ వొడ్డుకు తీసుకెళ్లి కాస్సేపు తిప్పి తీసుకొస్తున్నాడంతే''

"నీ బ్రతుక్కు చల్లగాలి షికారులొక్కటే తక్కువయినాయన్నమాట''

"మీకిష్టం లేకపోతే మా తమ్ముడితో చెప్పండి తీసుకెళ్లద్దని''

"నేను చెప్పడమేం? నీకు నోరు లేదా?''

"మీరు కోప్పడతారని, నేనింతకుముందు అనేకసార్లు వాడికి చెప్పాను. కానీ 'బావ అడిగినప్పుడు నేను జవాబు చెబుతాలే' అని వాడు నిర్బంధనం చేసి తీసుకువెళుతున్నాడు.''

"అతనితో నేను చెప్పను. మధు ఇష్టమొచ్చినట్లే చేయి. నేనిలా అన్నా నని, తిరిగి అతని దగ్గర అఘోరించకు తెలిసిందా?'''

"సరేలెండి. ఇందుకేనా పిల్చారు?"

"అవును ఇందుకే" అని ఆ భార్యాభర్తలిద్దరూ మాటలాడుతూ వున్న సమయంలో మధు అక్కడికొచ్చాడు.

"ఏమిటోయ్ బావా! అక్కతో గందరగోళం పడుతున్నావెందుకు?" అని తీక్షణంగా అడిగాడు.

"అబ్బే గందరగోళమేమీలేదు" అని అక్కడినుండి వెళ్లిపోతూ అతనితో ఏ వ్యవహారమూ చెప్పొద్దన్నట్లుగా భార్యనోసారి కళ్లతో సౌంజ్ఞ చేసి భాస్కరం అక్కడినుంచి మెల్లగా జారిపోయాడు.

భర్త వెళ్లిపోగానే అతనికీ తనకూ జరిగిన సంభాషణ అంతటనీ మంజరి తమ్ముడికి పూస గుచ్చినట్లు చెప్పింది.

అందుకా ఇద్దరూ కొంచెంసేపు నవ్వుకున్నారు.

"మొత్తానికి నేనంటే బావకు కొంచెం బెదురుందన్నమాట"

"కొంచెమేమిటి? చాలా ఎక్కువగానే వుంది."

"ఇది మనమాడబోయే నాటక రంగాలకు అనుకూలమైన వాతావరణం."

"నిజమే"

"గోరా మనకు పూర్తిగా కలసి వచ్చాడు."

"అతను కలసి రాకపోతే అసలు కథే లేకపోవును."

"అడ్డుతుందా ఏమిటి? మరియొక ప్లాను వేస్తాం"

"నువ్వెందుకయినా సమర్థుడవేరా తమ్ముడూ? అయితే మన ప్లాను కొనసాగుతుందంటావా?"

"కొద్దిరోజులు ఓపిక పట్టావంటే నువ్వే చూస్తావు"

"తమ్ముడూ! నువ్వు కాబట్టి నా గురించి ఇంత అవస్థ పడుతున్నావు. లేకపోతే నా గొడవ ఎవరికి కావాలి?"

"నువ్వు చాలా గొప్ప పొరపాటు చేసావక్కా?"

"ఏమిటదీ?"

"బావ నిన్ను పెట్టే హింసలను గురించి నాతో ఇంతకాలం వరకూ చెప్పకుండా ఉండడం ఎంత పొరపాటు?"

"నిజమేగానీ ఈ గొడవలన్నీ నీకు తెలిస్తే ఇంతకంటే పెద్ద గొడవలయిపోతాయేమోనని భయపడ్డాను"

"మంచి పని చేసావులే అక్కా. ఇంకా నయం... ఇప్పుడయినా చెప్పావు"

"ఇక నీ దగ్గర దాచుకోలేకపోయాను"

"అతను పెట్టే హింసలు, చేసే దారుణాలు నువ్వు నాకు చెబుతావన్న భయం కూడా అతనికి లేకపోయిందా అక్కా"

"లేదు. వారికా భయం ఇప్పటికి కూడా లేదు.

"ఎందుచేతనో?"

"నేను చాలా గుట్టుగల మనిషిననీ, సంసారాన్నీ, వారినీ అల్లరి పెట్టననీ వారికి చాలా గట్టి నమ్మకముంది."

"ఇప్పుడు కూడానా?"

"ఆ... ఇప్పుడు కూడా వారికటువంటి నమ్మకమే వుంది."

"సరేలే. అది కూడా ఒకందుకు మంచిదే"

"వారు పెట్టే బాధలు, చేసే అనాదరణ పడలేక ఒక్కొక్కప్పుడు కళ్లు మూసుకుని ఏ నూతిలోనైనా దిగి నిజంగా చచ్చిపోదామనుకునేదాన్ని మధూ"

"చాల్లే. అంతకుమించిన తెలివితక్కువ పని ఇంకొకటి లేదు"

"నిజమేగానీ నాలో పెరిగిన నిరాశ నిస్పృహ అటువంటి సాహసానికి ప్రోత్సహించేవి."

"చచ్చి సాధించగలదేమీ లేదక్కా. బ్రతికి వుంటేనే దేనినైనా సాధించడానికి వీలవుతుంది. నువ్వు చచ్చిపోయినందువల్ల ఆ వ్యసనపరుడికి పోయిందేమీలేదు. లక్షా యాభైమంది వేశ్యలతని చుట్టూ మూగుతారు."

"నా బ్రతుకు వారికి కంటకప్రాయమైంది కాబట్టి నేనీ లోకాన్ని శాశ్వతంగా విడిచి ఎప్పుడు పోతానా అని వారూ ఎదురు చూస్తూనే ఉన్నారు. నీ బెదురు కనుక వారికి లేకపోయినట్లయితే ఈపాటికి ఏ విషమైనా మింగించి నా తనువును చల్లార్చకపోయారా?"

"ఉంటారిటువంటి మూర్ఖులు. ఇంట్లో అప్సరస లాంటి భార్య ఉండగా, పరస్త్రీలకై ప్రాకులాడే చవటల్ని అనేకమందిని చూసాను. సరేలే. అతని ఆటలు ఇక జరిగినంత కాలం జరగవు" అని అతడు నిస్పృహ, నిరాశలతో కృంగిపోయివున్న అక్కగారికి ధైర్యం గొలుపుతున్నాడు.

***

"ఇదేమిటోయ్ గోరా! ఇలా చేసావేమిటి? ఈ చెట్టుకింద ఇలా ఎంతసేపని నిలుచుంటాం? కాళ్లు పీక్కుపోతున్నాయి కూడాను."

"అలాఅంటే ఎలాగు బ్రదర్. కొంచెం ఓపిక పట్టాలి. ఆమె ఆ కిటికీ దగ్గరకొచ్చి మనకు సౌంజ్ఞ చేస్తుంది. అప్పుడు మనం లోపలికెళ్లాలి. అంతవరకూ వెళ్లడానికి వల్లకాదు."

"మంచి ఏర్పాట్లే చేసావు. నాలుగ్గంటలకొచ్చాము. ఇంతవరకూ అతీగతీలేదు."

"పాల కోసం రాయి మొయ్యమన్నారు పెద్దలు. తెలిసిందా?"

"నిజమేగానీ... విసుగొస్తోంది. ఎప్పుడనగా వచ్చాము? నాలుగ్గంటలకొచ్చాము. ఇప్పుడు దీపాలు కూడా పెట్టారు చూసావా?"

"అయితేనేంలే? ఈవేళ ఎంత రాత్రయినా సరే నిన్ను లోపలకు తీసుకెళ్లాలి, ఆ సుందరాంగితో మాటలాడించాలి."


"ఆమె ఇంతవరకూ కిటికీ దగ్గరకొచ్చి మనకు సౌంజ్ఞ చేయకపోవడానికి కారణమేమంటావు?"

"ఏమో.. ఆ లోపల పరిస్థితి ఎలా వుందో మనకేం తెలుస్తుంది? ఆ తల్లి అసాధ్యురాలు. ఆమెకు తెలియకుండా జరగాలీ పని"

"అలాగా?"

"మరేమిటనుకున్నావు? లేకపోతే ఇంత ఆలస్యమెందుకవుతుంది? మామూలు వ్యభిచార వృత్తిలో వున్నవాళ్లను గురించి అయితే ఇంత శ్రమ లేదు."

"నాకర్థం కాలేదు"



"మనం మొదట అనుకున్నట్లు ఆమె వ్యభిచార వృత్తిలో లేదు. గొప్ప స్థితిమంతుడెవర్నయినా చూసి ఆ పిల్లకు పెళ్లి చేయాలని తల్లి పట్టు"

"ఓహో...అదా సంగతి! అయితే మన కోరిక ఎలా నెరవేరుతుంది?"

"తల్లికి కన్నుకప్పి ఈ వ్యవహారమును సాగించడానికి కూతుర్ని అంగీకరింపజేసాను. ఆమె కోరిన డబ్బిస్తానని, నువ్వు గొప్ప స్థితిమంతుడవనీ మొదలైన సంగతులు చెప్పి ఆమెను ఒప్పించానన్నమాట?"

"సరి...సరి...నాకర్థమయింది ఇప్పుడు. అయితే ఇంకో సంగతి.." అని భాస్కరం ఏమో చెప్పబోయి కిటికీ వైపు చూసాడు.

"అదిగో ఆమె కిటికీ దగ్గరకొచ్చినట్లుగా ఉందోయ్. తెల్లచీర కనిపిస్తోంది చూడు" అని భాస్కరం చెప్పిన మీదట గోరా కూడా ఆ వైపు చూసి-

"అవునోయ్. నిజమే ఆమె వచ్చింది."

"అయితే ఈ చీకట్లో ఆమె సౌంజ్ఞ మనకెలా తెలుస్తుంది?" అంటూనే భాస్కరం ఆ కిటికీవైపు నాలుగడుగులు చరచర నడిచాడు. ఇంతలో ఆ కిటికీ దగ్గర నిలుచున్న వ్యక్తి తప్పుకోవడంవల్ల అతడు నిస్పృహ చెంది వెనక్కు వచ్చాడు. "ఆమె వెళ్లిపోయినట్లుందే?'

"వెళ్లిపోతే ఏంలే...తిరిగి వస్తుంది"

"ఈవేళ నా కోరిక నెరవేరుతుందని చాలా ఆశపడ్డాను సుమా. కొత్త బ్లేడుతో క్షవరం చేసుకుని తలంటి పోసుకున్నాను. విలువగల పట్టుదుస్తులు ధరించాను. ఎంత మంచి సెంటు రాసుకున్నానో చూసావా?"

"అవును...అవన్నీ వృధా పోవులే"

"ఏమో...అంతా నీలో ఉంది. ఏమి చేస్తావో?"

"నాకిప్పుడింకో ఆలోచన కూడా తట్టింది."

"ఏమిటది?"

"ఆమెను వివాహం చేసుకోవడానికి నువ్వే అంగీకరించినట్లయితే బావుంటుందేమో. కానీ నీకు భార్య ఉంది"

"వుంటే దాని లెక్క మనకేముంది?"

"లేదుగానీ...ఈమె మన కులంకాదు. మన గోత్రం కాదు"

"అబ్బా...చూస్తూ చూస్తూ అటువంటివాళ్లను ఎలా పెళ్లి చేసుకోమంటావోయ్? కులంలో వెలి వెయ్యరూ?"

"వల్లకాదు. ఈ రోజుల్లో వర్ణాశ్రమ ధర్మాలనెవరు పాటిస్తున్నారులే. ఆదిలో సర్వకులాలు ఒకటేనని శాస్త్ర ప్రమాణముంది. తెలిసిందా?"

"అయితే నీ ఇష్టం కానియ్యి"

"మరేమీలేదు. తల్లి కన్నుకప్పి ఒకటి రెండుసార్లు ఈ వ్యవహారం సాగించినప్పటికీ ఎక్కువకాలం జరగడానికి వీల్లేదు. వివాహం చేసుకున్నావంటే ఆ అప్సరసతో భూతలస్వర్గం అనుభవిస్తావు"

"అలాగే కానియ్యి. కులగోత్రాల మాట తరువాత ఆలోచిద్దాము."

"నేనంటున్నాననిగాదు. నువ్వు కూడా బాగా ఆలోచించు. అటువంటి సౌందర్యవతులు దేవలోకంలో కూడా వుండరన్న విషయాన్ని మాత్రం నేను ఢంకాపదంగా చెప్పగలను."

"సరే...మొదట ఆమెను ఒకసారి చూసి ఆమె తత్వమెటువంటిదో తెలుసుకున్న మీదట అవసరమైతే పెళ్లే చేసేసుకుందాం."

వారావిధంగా మాటలాడుతూ ఉండగా రాత్రి తొమ్మిదిగంటలు కూడా అయింది. ఆలస్యమెక్కువయినకొద్దీ భాస్కరానికి ఆదుర్దా హెచ్చుతూంది.

"ఏమోయ్! ఈ వేళకింక లాభం లేదనుకుంటాను."

"మంచి మాటే. ఆమె మాట ఇచ్చాక దగా చేయదు. తల్లి నిద్దరపోయి నాక నిన్ను తప్పక లోపలకు రప్పించుకుంటుంది."

"అబ్బ... ఈమె గురించి ఎంతకాలం నుంచి ప్రయత్నం చేయవలసివచ్చిందోయ్ గోరా"

"అటువంటి సౌందర్యవతి కోసం ఎంతకాలం ప్రయత్నం చేసినా నష్టం లేదు."

"నిజమేగానీ చివరకు ఫలితం దక్కితే పడిన శ్రమ అంతా శ్రమలా అనిపించదు."

"అయితే నువ్వామెను అవసరమైతే వివాహం చేసుకోవడానికి కూడా సిద్ధంగా ఉన్నావన్న మాటేనా?"

"ఆ... అందులో చచ్చేమీలేదు."

"నీ భార్యగానీ, నీ బావమరిదిగానీ అడ్డు రారంటావా?"

"భార్య వట్టి చవట. దాని భయం నాకెంతమాత్రం లేదుగానీ..."

"మరి ఇంకెవరి భయముంది?"

"బావమరిది మధుగాడు ఉద్దండుడు. ఈ వ్యవహారం కనుక వాడికి తెలిసిందంటే నన్ను తవ్వి పాతేస్తాడు తప్పదు."

"మరయితే ఎలాగు?"

"వాడికి తెలియకుండానే వ్యవహరించాలి. అదిగో చూడు ఆ కిటికీలో ఏమిటో తెల్లగా కనిపిస్తోంది."

"అవును. ఆ సుందరాంగే. సౌంజ్ఞ చేస్తోందేమో జాగ్రత్తగా చూడు. నాకు చూపానదు."

"ఇంత చీకట్లో నాకు మాత్రం ఏం కనిపించి ఏడుస్తుంది? కొంచెం దగ్గరగా వెళ్లి చూస్తానుండు" అంటూ భాస్కరం ఆ చీకట్లో తడుముకుంటూ నాలుగడుగులు ముందుకు వేసాడు. కిటికీలో ఆమె వుందని నిర్ధారణ చేసుకున్నాడు. మరి నాలుగడుగులు ముందుకు వేసాడు.

క్రమంగా ఆ కిటికీ దగ్గరకు వెళ్లి నిలుచున్నాడు. ఆమె ఇంకా అక్కడనే వుంది. నల్లటి చీకట్లో తెల్లటి చీర తప్ప ఇంకేమీ అవుపించడంలేదు.

"రమ్మన్నావా?" అని వణకుతున్న గొంతుకతో మెల్లగా అడిగాడు.

"ఎవరు మీరు?" అని ఆమె తీక్షణంగా అడగడంతోనే అతని ప్రాణాలు మీదునా ఎగిరిపోయినాయి. అయినప్పటికీ ధైర్యమును చిక్కబట్టి-

"మా గోరా చెప్పలేదూ... నేనే భాస్కరాన్ని" అన్నాడు.

"ఓ మీరేనా? ఎన్నిసార్లు సౌంజ్ఞ చేసినా రారేం?"

"చీకట్లో అవుపించలేదు. క్షమించాలి. దారి ఎటు?"

"కుడిచేతివైపు పిట్టగోడ వుంది. దానినెక్కి మెల్లగా లోపలకు దిగండి. ఊ...త్వరగా" అని ఆమె హెచ్చరించగానే భాస్కరం ఆనందపరవశుడైపోయినాడు. వెనుక గోరా వున్న విషయమును కూడా మరచిపోయాడు.

ఆమె సూచించిన ప్రకారంగా కుడిచేతివైపున తడుముకుని అక్కడ ఒక గోడ వుండడమును తెలుసుకున్నాడు. ఇక ఆలస్యం చేయలేదు. పైమీది కండువాను నడుముకు బిగించి ఆ గోడంట ప్రాకడం మొదలుపెట్టాడు. కన్ను పొడుచుకున్నా ఏమీ అవుపించడంలేదు. ఆ గోడ నునుపుగా వుండడంవల్ల దానిని ఎగబ్రాకడం కష్టతరమైంది.

'ఇది పిట్టగోడ కాదు, పెద్ద గోడే. సమయానికి వెధవ చీకటొకటీ? ఇంత రాత్రవుతుందని గోరాగాడు ముందుగానే చెప్పినట్లయితే బ్యాటరీలైటు తీసుకురానూ?' అని తనలో అనుకుని భాస్కరం అతి కష్టంమీద గోడకెగబ్రాకుతున్నాడు. అక్కడ చెట్టుకింద నిలుచున్న గోరా, భాస్కరం ఎంతకూ రాకపోవడం చూచి అతను కూడా ఆ దెసకు వెళ్లాడు.

కిటికీలో ఎవ్వరూలేరు. గోడకెగబ్రాకుతున్న భాస్కరం అతన్ని చూసి "గోరా! గోరా! త్వరగా రావాలి. కొంచెం సాయం చేసి పైకి తోయవోయ్" అనేటప్పటికి గోరా తెల్లబోయాడు.

"అదేమిటి? ఆ గోడెక్కుతున్నావెందుకు?" అని అడిగాడు.

"ఆమె రమ్మంది. ఈ గోడ దూకి అవతలకు రమ్మంది" అని భాస్కరం ఒగర్చుకుంటూ చెప్పగా-

"ఓయ్...నీ అసాధ్యంగూలా! నాతో చెప్పనైనా చెప్పావుగావేం. ఈ గోడ చాలా ప్రమాదకరమైనది సుమా!" అన్నాడు గోరా.

"అందుకే నిన్నో చేయి వేసి పైకి తొయ్యమంటున్నాను" అని భాస్కరం అనగా పొంగి పొర్లి వచ్చే నవ్వును తనలోనే అణచుకుంటూ గోరా రెండు చేతులతోనూ అతన్ని గోడకెగదోస్తున్నాడు. కొంతదూరం ఎగదోసాడు. ఇక చేతులందడంలేదు.

"మెల్లగా ప్రాకి పోవోయ్. అందకుండా ఉన్నావు" అని గోరా చేతులు రెండూ వదిలేసాడు. పట్టుకోవడానికి సరైన ఆస్కారమేమీలేదు. పైకెగబ్రాకడానికీ ఆధారంలేదు. భాస్కరానికి ఒళ్లంతా చెమట్లు పోసాయి. కడుపు కొట్టుకుపోయింది. అప్పుడిక ఏమిటీ చేయడం? ఆ నిస్సహాయ స్థితిలో అతని కాలు కూడా జారిపోయింది. దానితో భాస్కరం ఉబ్బెత్తుగా కిందకి కూలబడ్డాడు. చీకట్లో కనిపించలేదుగానీ అది ఒక పెద్ద మురికిగుంట. రెండుమూడు గజాల లోతున, కుళ్లు కంపు కొడుతూ ఉంది. కాలు జారిపోవడంవల్ల భాస్కరం దభాలున ఆ కుళ్లు గోతిలో పడిపోయినాడు.

"గోరా! చచ్చానోయ్... రా...రా... చేయి ఇయ్యి" అని భాస్కరం ఒక పెద్ద కేక వేయడంతోనే గోరా ఫకాలున నవ్వాడు. అక్కడా మురికి గొయ్యి ఉందన్న విషయం అతనికి తెలియకపోలేదు. కానీ కార్యం మించిపోయింది. ఏమిటి చేయడం?

ఒళ్లు, తల, బట్టలు అన్నీ బురదతో మునిగిపోయినాయి. చేయందించి అతన్ని పైకి తీద్దామంటే ఆ చీకట్లో అతనెక్కడున్నదీ అవుపించడంలేదు.

"ఇదిగో చెయ్యి.. పట్టుకుని లేచి రావోయ్ సరసుడా!" అని గోరా చేయి అందించాడు.

"చచ్చేటప్పుడు సంధి మంత్రమని ఇప్పుడుటోయ్ గోరా వేళాకోళం?" అని ఒగర్చుకుంటూ భాస్కరం ఎలాగో అతని చేయిని దొరకబుచ్చుకుని ఆ మురికి గుంటలోంచి చచ్చిచెడి చాయంగల విన్నపముల మీద బ్రతికి బయటపడ్డాడు.

అప్పుడా చీకట్లో అతని అవతారం లీనమైపోయింది. ఎక్కడ నుంచో ఎవరో ఇద్దరు ముగ్గురు నవ్వుతున్నట్లు పెద్ద అట్టహాసం వినిపించింది.

"ఆమె చూడలేదుగదా గోరా! ఆ నవ్వులెవరూ?" అని భాస్కరం ఆయాసంతో అన్నాడు.

"ఎవరైతేనేమిలే... ఇప్పుడు కర్తవ్యమేమిటి?"

"ఇంకేముంది? ఇంటికి పోదాం నడు. ఈవేళకిలా అయిపోయింది."

"అబ్బే...ఎందుకు? మెల్లగా ఆమెను కేకేసి ఇంకో దారేదైనా ఉందేమో అడుగుతా. ఆ దారంట లోపలకెడుదువుగాని"

"ఈ బురద బట్టలతోనా? చాలు చాలు... రేపు తిరిగి వద్దాం నడు" అని భాస్కరం అనడంవల్ల గోరా కూడా అతనితో తిరోగమనం చేసాడు.


***

గత రాత్రి జరిగిన పరాభవంతో భాస్కరానికి పట్టుదల మరింత ఎక్కువయింది. ఆరుమూడయినా సరే అటు సూర్యుడిటు పొడిచినాసరే ఆ సుందరాంగిని అనుభవించి తీరాలని ప్రతిజ్ఞ చేసాడు.

ఆమెను వివాహం చేసుకునే ప్రయత్నం మీద వెళ్లడానికి గోరా ఏర్పాటు చేసి వచ్చాడు.ఈసారి అపజయమంటూ ఉండదని స్నేహితుడికి ధైర్యం చెప్పాడు. భాస్కరం తిరిగి కొత్త దుస్తులతో ముస్తాబైనాడు. పరిమళ ద్రవ్యాలతో దిల్‌కుషీగా తయారైనాడు.అంతకుముందు గావించుకున్న ఏర్పాటు ప్రకారం రాత్రి భోజనాలు వగైరాలు పూర్తి అయిన తరువాత జట్కా బండినెక్కి గోరా, స్నేహితుడ్ని వెంటబెట్టుకుని తీసుకువచ్చాడు.


పెళ్లికూతురు తల్లి వారిని ఆహ్వానించి మర్యాదచేసి కూర్చోబెట్టింది. తాననుభవించబోయే సౌందర్యవతిని చూడాలని భాస్కరం తహతహలాడుతున్నాడు. తల్లితో మాటలాడి ఆమెను ఒప్పించినగాని తన కోరిక నెరవేరదని భాస్కరానికి తెలుసు. అందువల్ల వ్యవహారమును త్వరగా తేల్చవలసిందని గోరాకు చెప్పాడు.

అందువల్ల గోరాయే ముందుగా సంభాషణను ప్రారంభించాడు.



## దక్షిణాది అంటే ఇష్టం!

బాలీవుడ్‌లో హీరోయిన్‌గా నటించే అవకాశం ఎప్పుడు వస్తుందా అని ఆశగా ఎదురు చూస్తుంటారు మన హీరోయిన్లు. కానీ అందుకు విరుద్ధంగా 'బాలీవుడ్‌కన్నా దక్షిణాదికే నా మొదటి ప్రాధాన్యత' అని స్టేట్‌మెంట్ ఇచ్చి అందర్నీ ఆశ్చర్యచకితుల్ని చేసింది హన్సిక. 'దక్షిణాదిలో చిత్ర నిర్మాణం చక్కటి ప్లానింగ్‌తో జరుగుతుంది. అనుకున్న సమయానికి చిత్ర నిర్మాణం పూర్తవుతుంది. నాకు హిందీలో హీరోయిన్‌గా నటించే అవకాశాలు వస్తున్నప్పటికీ నాకెందుకో ఇక్కడ నటించడమంటేనే ఇష్టం' అంటోంది హన్సిక.



"ఇతను నా స్నేహితుడు, భాస్కరం. చాలా ఉత్తముడు, స్థితిపరుడును. సాలుకు అయిదువేల రూపాయలువచ్చే భూవసతి వుంది" అని గోరా చెబుతుంటే-

"చిత్తం" అని పెళ్లికూతురుతల్లి ముక్తసరిగా జవాబు చెప్పింది.

"మీ అమ్మాయి చాలా అందంగా వుంటుందని తెలుసుకుని ఆమెను చూడాలని వచ్చాడు."

"ఉద్దేశ్యమేమిటి?"

"శాశ్వతంగా తన పోషవర్గంలో వుంచుకుందామని"

"నాకటువంటి అభిప్రాయము లేదండీ. తగిన వరుణ్ణి చూసి పెళ్లి చేయాలని వుంది."

"మావాడు అందుక్కూడా తయారుగానే వున్నాడు. అందువల్ల సందేహించక అమ్మాయినొకసారి చూపండి"

"వీరికింతకుముందు వివాహమయిందనీ, భార్య కూడా ఉందని తమరు చెప్పారుగా"

"నిజమే. ఆమె అందమైనదికాదు. తెలివితేటలు కూడా లేవు. అందువల్ల తిరిగి ఇటువంటి ప్రయత్నము చేయవలసివచ్చింది."

"కట్టుకున్న భార్య వూరుకుంటుందా?"

"ఊరుకుంటుంది."

"ఇంతకుముందామె వంటిమీద ఆభరణాలు వగైరాలు ఏమైనా ఉన్నాయా?"

"ఆమెయందతనికాదినుంచీ ఇష్టంలేదు. అందువల్ల మెడలో నల్లపూసలు, మంగళసూత్రామూ తప్ప ఇతర ఆభరణాలేమీలేవు. చెవులకు, ముక్కుకు, చేతులకు కూడా చిన్నమెత్తు బంగారమైనా పెట్టలేదు. ఇనప్పెట్టి నిండా కావలసినన్ని ఆభరణాలున్నాయి."

"భార్యయందు ఈయన కిష్టంలేదమ్మమాట"

"లేదు. ఆమె వొంటిమీద దమ్మిడీ యెత్తు బంగారం లేకుండా అవయావాలన్నీ బోసిగా ఉంచెయ్యడమే కాకుండా ఆమె కట్టుకోవడము, తినడమూ కూడా అతనికిష్టంలేదు. ఆమెకు రెండే రెండు చవకరకపు చీరలు తప్ప కట్టుకోవడానికైనా ఇంకేమీలేవు. తాను తిరిగి చేపట్టే సుందరి కోసం అన్నీ మూటగట్టాడు."

"బాగానే వుంది. కానీ ముందు ముందా భార్యవల్ల ఏమైనా పేచీలు వస్తాయేమోనని ఆలోచిస్తున్నాను" అని ఆమె అన్నదానికి-

"ఏమీ పేచీలు రావులెండి. ముందుగా మీరు అమ్మాయిని చూపండి" అని భాస్కరం అనగానే ఆ ముసలమ్మ లోపలికెళ్లి కుమార్తెను చెయ్యి పట్టుకుని తీసుకొచ్చి ఆ చేరువలో నిలుచోబెట్టేటప్పటికి భాస్కరం కళ్లు జిగేలుమన్నాయి. ఆమె సిగ్గుచేత, తలను కిందకి దించుకుని ఉంది. అక్కడి దీపమైనా ఎక్కువ కాంతివంతంగా లేదు.

ఐనప్పటికీ కనిపించినంతవరకూ ఆమె అద్భుత సౌందర్యమును చూచి భాస్కరం దిగ్భ్రాంతుడైనాడు. గోరా ఆమెను గురించి చెప్పినదానిలో ప్రతి అక్షరమూ యదార్థమని తెలుసుకున్నాడు. అప్సరస కన్యలు కూడా ఆ సుందరికి సాటిరాదని భాస్కరం తనలో అనుకుని మురిసిపోయినాడు. ఆ తక్షణం ఆమెను బిగియారా కౌగలించి ముద్దు పెట్టుకోవాలని తొట్రుపడ్డాడు. కానీ ఆ సుందరి అక్కడ ఎక్కువసేపు నిలుచోలేదు. తిరిగి ఆ పక్కగదిలోకి వెళ్లి తలుపును దగ్గరగా వేసుకుంది.

"మీ కోరికలన్నీ తీరుస్తాను. ఎలాగైనా మీ అమ్మాయికి నాకూ కుదర్చాలి" అని భాస్కరం ఆమె తల్లితో అన్నాడు.

"అందుకు వివాహం కంటే వేరు మార్గమేమీలేదు. అయితే ఇంకొక విషయం"

"సందేహించక చెప్పండి"

"భార్య ఉండగా తిరిగి మా పిల్లనివ్వడం ఎలాగైనా ప్రమాదం. తీరా వివాహమైనాక ఏం గొడవలొస్తాయో అని నాకు చాలా భయంగా ఉంది"

"అందుకు మీరేం చేయమంటే అలా చేయడానికి నేను సంసిద్ధుడనై ఉన్నాను."

"మీకున్నటువంటి చరస్థిరాస్తులన్నింటినీ మా అమ్మాయి పేర రాస్తారా?" అని ఆమె అడిగిన దానికి భాస్కరం ఆలోచించడం మొదలుపెట్టాడు.

"సందేహించకోయ్. నీ యావత్తు ఆస్తీ నీ పేర వుంటే వొకటీ, నీ భార్య పేర వుంటే ఒకటీనా? ఎవరో ఒకరికి సాహసముండాలి. ఈమె అలా అడుగుతున్నప్పుడు నువ్వు వెనుదియ్యకూడదు.'

"సరే అలాగే చేస్తాను" అని భాస్కరం ఖచ్చితంగా చెప్పాడు.

"శుభం. మీ సర్వస్వమూ మా అమ్మాయి పేర రాసి రిజిష్టరీ చేయించిన మరుక్షణంలో ఆమెను మీ స్వాధీనం చేస్తాను" అని ఆమె చెప్పింది.

***

స్త్రీ వ్యామోహం ఎటువంటి పనినయినా చేయిస్తుందిగదా. పూచికపుల్లసహితంగా సర్వ చరస్థిరాస్తులనూ ఆమె పేర రాసి ఆ మరునాడే రిజిస్టరు చేయించాడు భాస్కరం. అంత పని చేసిన తరువాత వివాహం చేసుకున్నా సరే ఉంపుడుగత్తెగా ఉంచుకున్నా సరేనంది ఆమె తల్లి. ఏ విధంగా చేయడానికైనా సంసిద్ధంగానే ఉన్నాడు భాస్కరం. అందువల్ల ఆ రాత్రికా ఇద్దరనూ కలవడానికి ఏర్పాటు జరిగింది.

భాస్కరం ఆనాడింటికే వెళ్లలేదు. భోజనం వగైరాలనక్కడనే చేసాడు. దానవిక్రయాది అధికారాలతో తాను రాసి రిజిష్టరీ చేయించిన పట్టాను పెళ్లికూతురు తల్లి చేతుల్లోకి అందిస్తూ భాస్కరం ఇలా అన్నాడు.

"మీ అమ్మాయి పేరు కూడా మంజరి అని నాకు దస్తావేజు రాసే కాలంలో మాత్రమే తెలిసింది"

"అందులో విశేషమేముంది?"

"విశేషం కోసం కాదు, నా భార్య పేరు కూడా అదే కావడంవల్ల కొంచెం ఆశ్చర్యం కలిగింది."

"ఆ..దానికేంలెండి. ఒకే పేరుగల వారు అనేకమంది ఉంటారు" అని ఆమె చెప్పిన మీదట భాస్కరం ఆ విషయమును గురించి ఇక ఎక్కువగా ప్రస్తావించలేదు. ఆ రాత్రికా సుందరాంగితో సుఖించే భోగం తనకు కలుగుతుంది గదా అని భాస్కరం ఎంతయినా మురిసిపోతున్నాడుగానీ తన సర్వస్వమూ ఆమెకు ధారపోసి తాను బికారియైన విషయమును గమనించుకోలేదు. భార్యను విడిచిపెట్టియ్యడానికి కూడా అతడు సర్వ సన్నాహాలు చేసాడు. ఈ విషయంలో తనకెక్కువ ఉపకారము గావించిన గోరానతడనేక విధాల అభినందించాడు.

***

ఆ రాత్రి జరగబోయే శుభ ముహూర్తానికి గోరా సర్వ ప్రయత్నాలు చేయించాడు. తలపెట్టిన కార్యం యావత్తూ జరిగేవరకూ ఈవిషయం వెల్లడయితే బావమరిది మధు అడ్డు తగులుతాడన్న భయంవల్ల అంతా రహస్యంగానే జరిగిస్తున్నాడు భాస్కరం.

ఎప్పుడు చీకటి పడుతుందా రంభవంటి ఆ యువతితో తానెప్పుడు భూతల స్వర్గమునునుభవించడమా అన్న ఆరాటంతప్ప భాస్కరానికప్పుడు వేరు ఆలోచనే లేకపోయింది. క్రమంగా ఆ శుభ సమయము

చ్చింది. చక్కగా అలంకరించబడిన గదిలోకి పందిరిమంచం మీదకి కలుగ నైయున్న ఆనందాన్ని తల్చుకుంటూ మైమరచియున్న భాస్కరం ప్రవేశించాడు. మరికొంతసేపటికి సర్వాలంకార విభూషితురాలైన ఆ సుందరాంగి అపర రతీదేవివలె ఆ గదిలో ప్రవేశించింది చిరునవ్వు ముఖంతో.

స్నో పవుడరులద్దబడిన నిగారింపు తళుకు ముఖంపై నల్లటి తిలకము నద్ది దీర్ఘములైన కురులను వాలు జడగా అల్లి పైన కనకాంబరం, నీలాంబరం మల్లి కలిసిన పూలచెండును ధరించింది. విలువగల సిల్కుచీర, చెమ్కీ జాకెట్టు, చెవులకు చక్రాల లోలాకులు, చంద్రహారము, వడ్డాణము మొదలైన ఆభరణాలింకా యెన్నో!

వీటన్నింటితోనూ అవతరించిన అప్సరసవలె కళ్లకు మిరుమిట్లు గొలిపే ఆ సుందరి వొక్కసారి కళ్లారా చూసాడు భాస్కరం. అంతవరకూ ఎలాగో ఓపిక పట్టాడుగానీ ఇహ పట్టలేకపోయినాడు.

కూర్చున్న చోటులోంచి ఒళ్లు తెలియని మైకంతో లేచి "ఎంత కాలానికి నా కోరిక నెరవేరింది?'' అని అమాంతంగా ఆమెను కౌగలించుకుని ఊపిరి సలపకుండా చేసాడు. అప్పుడా సుందరికెందుకో అపరిమితమైన నవ్వు వచ్చింది.

"మీ కోరికే కాదు, నా కోరిక కూడా నెరవేరడానికిదే శుభసమయం'' అంటూ ఆమె కూడా అతనిని కౌగలించుకుంది. కొంతసేపా ఇద్దరూ అదే విధంగా ఒళ్లు తెలియని పరవశత్వంతో ఉండిపోయారు. అనంతరం-

"నాయందు మీకెంతమక్కువుందీ?'' అంటూ ఆమె అతని చేయి పట్టుకుని తీసుకెళ్లి పాన్పు చేర్చింది.

"నీయందెంత వ్యామోహము లేకపోయినట్లయితే నా సర్వస్వమును వెనుకాముందు ఆలోచించకుండా నీ పేర రాసి రిజిష్టరీ చేయిస్తానా?'' అంటూ అతడామె నునుచెక్కులపై ముద్దు పెట్టుకుని "నీవంటి సుందరాంగి లభించడంవల్ల నా జన్మ తరించిందనుకుంటున్నాను''

"మీవంటి సరసులు లభ్యమైనందుకు నేనూ అలాగే అనుకుంటున్నాను'' అని ఆమె చిరునవ్వు ముఖంతో అంది.

గదిలోని దీపం తగ్గించబడి ఉండడంవల్ల వెలుతురు ఎక్కువగా లేదు. ఆమె సుందర రూపమునింకా తనివితీరా చూడాలన్న పిపాసతో అతడక్కడి దీపమును మరింత పెద్దదిగాచేసి తిరిగి ఆమె దగ్గరకురాగా ఆమె పకపక నవ్వుతూంది. అందుకు కారణము తెలుసుకోలేక అతడామె ముఖంలోకి పరిశీలనగా చూసాడు. అంతవరకూ అతడామెను పోల్చుకోనేలేదు.

తన భార్య మంజరేనని తెలియగానే అతను నిలువునా నీర్సై కొయ్యబారిపోయాడు. "మంజరీ! నువ్వేనా?'' అని భయ విభ్రాంతుడై ఒక పెద్ద కేక వేసాడు. ఆమె పకపక నవ్వుతూంది. అంతవరకూ ఆ మంచం కిందనే దాగొనివున్న మధు విరగబడి నవ్వుతూ ఇవతలికి వచ్చి-

"ఏమోయ్ బావా నీకళ్లకిప్పుడెవరందంగా ఉన్నారు?'' అని అడిగాడు.

భాస్కరం తెల్లబోయి నాలుగువైపులా చూడడం మొదలుపెట్టాడు. అతనికేమీ అర్థం కావడంలేదు. "ఈ మహామాయ అంతా ఏమిటి? గోరా! గోరా!'' అంటూ తలుపు తీసుకుని ఇవతలకు రాబోయాడు.

అప్పుడు గోరా కూడా వారున్న దగ్గరకొచ్చి "భయపడకోయ్ భాస్కరం... ఇప్పుడొచ్చిన ప్రమాదమేమీలేదు. నీ భార్యనూ నిన్నూ కలపడానికి మధు చేత పన్నబడిన తంత్రమిదంతాను. నువ్వు రిజిష్టరీ చేసిన దస్తావేజును సరిగా చూడలేదుగానీ లేకపోతే అప్పుడే తెలిసిపోనీ వ్యవహారమంతాను. అందులోనే మీ మామగారి పేరు, మంజరి పేరు కూడా వుంది. ఇటువంటి అప్సరసవంటి భార్యను అనాదరణ చేసినందుకు విచారించి ఇప్పుడయినా కళ్లు తెరు'' అని గోరా చెప్పగా-

"ఏమంటావోయ్ బావా! ఇప్పుడు నీకెవరందంగా కనిపిస్తున్నారు? సరసీరుహమా? మా అక్కా?'' అని మధు తిరిగి నవ్వుతూ అడిగాడు. అతనా విధంగా ఎదుట నిలిచి అడుగుతూ ఉంటే భాస్కరానికి ఆపాదమస్తము భయంతో వణికిపోవడం మొదలుపెట్టింది.

"మునుపటి మంజరికీ ఇప్పటి మంజరికీ ఎక్కడా పోలికైనా లేకపోవడం వల్ల గుర్తు పట్టలేకపోయాను మధూ. ఇప్పుడీమెలో ఇటువంటి దేవతా సౌందర్యం ఎలా వచ్చిందో తెలియడంలేదు'' అని భాస్కరం తిరిగి తిరిగి ఆమె ముఖంలోకి చూడడం మొదలుపెట్టాడు.

"సరియైన బట్ట లేకుండాను, ఒక్క వస్తువయినా లేకుండాను, ఆమెను బోడిగా దీపం సమ్మెలాగున అట్టే పెట్టావు. అందువల్ల ఆమె సహజ సౌందర్యం ఇంతవరకూ మరుగున పడి వుంది. గోరా ఇంట్లో నుంచి తీసుకొచ్చి నాలుగు వస్తువులూ పెట్టి మంచి చీర కట్టగానే ఈమె అపర రతీదేవియై నీ ఎదుట నిలుచుంది. కట్టు, బొట్టు వగైరాలు కూడా మార్చబడడం చేత నువ్వు అసలే గుర్తించలేకపోయావు. నీకు తెలియని ఒక వృద్ధురాలీమె తల్లిగా నటించింది. పిచ్చివాడా! ఇంట్లో ఇటువంటి రంభవంటి భార్యను వుంచుకుని పర స్త్రీలకోసం ప్రాకులాడే చవటవుకాబట్టి, మంచిచెడ్డలు గుర్తించుకోలేని మూర్ఖుడవయినావు'' అని భాస్కరాన్ని నాలుగు చీవాట్లు వేసాడు మధు.

"మధూ! నేనింతకాలం నుంచీ నిజంగా మూర్ఖుణ్ణే అయిపోయి ఇప్పుడు కళ్లు తెరిచి పశ్చాత్తాప్పడుతున్నాను. నువ్వు నా తప్పులు క్షమించాలి'' అని భాస్కరం బావమరిది చేతులూ పట్టుకుని బ్రతిమాలాడు.

"నన్ను కాదు క్షమాభిక్ష వేడడం. అదిగో... ఆమె నీ భార్య, నీ కులాంగన. కులాంగనకూ, కులటకూ ఎంత తారతమ్యముందో ఇప్పుడయినా తెలుసుకో. సరసీరుహం మొదలైనవారు నీ దగ్గర లాగగలిగినంతవరకూ లాగి నిన్నవతలకు సాగనంపారు. మంజరి కులాంగన కాబట్టి నువ్వు కొట్టినా, తిట్టినా, ఎన్ని హింసలు పెట్టినా అన్నింటినీ ఓర్చుకుని తిరిగి నిన్ను పొందడం కోసమే... ఇదే కులాంగనకూ, కులటకూగల వ్యత్యాసం. కనుక నువ్విడామెనే క్షమాభిక్ష వేడుకో'' అని బావమరిది చెప్పగా అదే విధంగా చేయడానికి భాస్కరం మంజరి దగ్గరకెళ్లి ఆమె రెండుచేతులూ పట్టుకుని క్షమాభిక్ష వేడుకోబోతుంటే ఆమె అతనిని వారించి-

"ఇంతవరకూ జరిగినది చాలు. మీకిప్పటికైనా నేనందంగా కనుపించడము, మీకు హృదయ పరివర్తనము కలగడమూ నా అదృష్టం'' అని ఆమె ఆనందభాష్పములు రాల్చగా, అప్పటికి మధు హృదయం చల్లబడింది.

భాస్కరం ఆనాడు మొదలుకొని పరస్త్రీని కన్నెత్తి చూస్తే ఒట్టు!

**(అయిపోయింది)**

